

జిల్లాలో అతిసార కేసులు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. గత నెల ఒకటవ తేదీ నుంచీ ఇప్పటి వరకూ అతిసార సోకి ఐదుగురు మృతి చెందగా సంబంధిత లక్షణాలతో 400 మందికి పైగా అస్వస్థతకు లోనయ్యారు.పలువురు బాధితులు స్థానికంగా వున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆస్పత్రుల్లో చేరి చికిత్స తీసుకుంటుండగా సీరియస్ కేసులు మాత్రం రుయాస్పత్రికి వస్తున్నాయి. కొన్నిచోట్ల కలుషిత ఆహారం కారణంగా అతిసార ప్రబలగా మరికొన్ని చోట్ల కలుషిత తాగునీటి వల్ల ఆ వ్యాధి సోకుతోంది.



తిరుపతి శివారులోని ఆటో నగర్‌లో ఇదీ పరిస్థితి

ప్రబలుతున్న అతిసార

కోట మండలంలో 230 కేసుల నమోదు

కోట మండల కేంద్రంలోని కమ్యూనిటీ ఆస్పత్రిలో గత నెల 1వ తేదీ నుంచీ 180 మంది డయేరియాతో చికిత్స కోసం చేరారు. చిట్టేడులోని హెల్త్ సబ్ సెంటర్‌లో 50 మంది చికిత్స పొందారు.బాధితులంతా కలుషిత ఆహారం తీసుకున్న కారణంగానే చికిత్స కోసం ఆస్పత్రులకు వచ్చారని వైద్యులు చెబుతున్నారు.

39రోజుల్లో ఐదుగురు మృతి... 400మందికి పైగా అస్వస్థత

కలుషిత ఆహారం, తాగునీరే కారణం



తిరుపతిలోని నిమ్మకాయల వీధిలో మంగళవారం ఉదయం రోడ్డుపై ప్రవహిస్తున్న డ్రైనేజీ నీళ్లు

తిరుపతి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు పట్టణం నందిమంగళంలో జూన్ 1న అతిసార ప్రబలింది. తాగునీటి పైపులైన్ లీకేజీ వుండడం వల్ల డ్రైనేజీ నీరు కలసిపోయి తాగునీరు కలుషితమైంది. ఈ నీటిని తాగడం వల్ల తీవ్ర అస్వస్థతకు గురై రాజగోపాలాచారి (70) గత నెల 6న మరణించగా నందిమంగళం దళితవాడకు చెందిన చిన్నారి దివ్య (12) గత నెల 8న మృతి చెందింది. కేవీబీపురం మండలం కాట్రపల్లిలో కలుషిత ఆహారం తీసుకున్న కారణంగా పలువురు అస్వస్థతకు లోనుకాగా వారిలో రెండేళ్ళ చిన్నారి దర్శిని మృత్యువాత పడింది. తిరుపతిలోని మనోవికాస్ మానసిక వికలాంగుల ప్రత్యేక ఆశ్రమ పాఠశాలలో కలుషిత ఆహారం కారణంగా అతిసార ప్రబలడంతో పదిమంది అనారోగ్యానికి లోనయ్యారు. వారిలో గణపతి (35) సోమవారం మరణించగా శేషాచలం (16) మంగళవారం చనిపోయారు.

తడలో పది... చిల్లకూరులో ఐదు

తడ మండలంలో పది అతిసార కేసులు నమోదయ్యాయి.వెంకటాద్రిపాలెం, పన్నంగాడు, బాలాజీ కుప్పం, పూడి, తడ, చేనిగుంట గ్రామాలకు చెందిన పదిమంది కలుషిత ఆహారం కారణంగా అస్వస్థతకు లోనయ్యారు. చిల్లకూరు మండల కేంద్రంలోని దళితవాడలో గత నెల ఐదుగురికి అతిసార సోకింది. కలుషిత ఆహారమే కారణమని గ్రామస్తులు చెబుతున్నారు.

ఆస్పత్రులవారీగా....

జిల్లాలో గత నెల నుంచీ ఆస్పత్రుల్లో అతిసార కేసులు తరచుగా నమోదవుతున్నాయి. తిరుపతి రుయా ఆస్పత్రిలో 80 కేసులు నమోదయ్యాయి. వైద్య విధాన పరిషత్ ఆధీనంలోని ఏరియా, కమ్యూనిటీ ఆస్పత్రుల్లో 92 కేసులు నమోదు కాగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 176 కేసులు నమోదయ్యాయి. తీవ్ర అనార్యోగానికి గురైన బాధితులు మాత్రమే తిరుపతి రుయాస్పత్రికి వస్తుండగా మిగిలిన వారు స్థానికంగా వున్న ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే చికిత్స తీసుకుంటున్నారు. ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న వారి సంఖ్య కూడా గణనీయంగానే వుంది. గూడూరు, పుత్తూరు, కేవీబీపురం, శ్రీకాళహస్తి, రేణిగుంట, చంద్రగిరి తదితర మండలాలతో పాటు మదనపల్లె, చిత్తూరు తదితర ప్రాంతాల నుంచీ ఎక్కువగా అతిసార లక్షణాలతో బాధితులు రుయాస్పత్రికి వస్తున్నారు.

గూడూరు మండలంలో 42 మందికి అతిసార

గూడూరు మండలం చెన్నూరు గిరిజన సంక్షేమ గురుకులంలో గత నెల 22న తాగునీటి ఆర్వో ప్లాంట్ మరమ్మతులకు గురైంది. గత్యంతరం లేక విద్యార్థులు బోరు నీటిని తాగారు. ఆ నీరు కలుషితమై వుండడంతో 20 మంది విద్యార్థులు వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు లోనయ్యారు. వీరిలో 12 మంది పరిస్థితి ఇబ్బందికరంగా మారడంతో మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తరలించారు. మిగిలిన వారికి వైద్య సిబ్బంది గురుకులంలోనే చికిత్స అందించింది. కాగా గూడూరు ఏరియా ఆస్పత్రిలో గత నెల నుంచీ ఇప్పటి దాకా 22 మంది అతిసార లక్షణాలతో చేరి చికిత్స పొందారు. మొత్తం 42 మంది మండలంలో అతిసార కేసులు నమోదయ్యాయి.

కేవీబీపురంలో 40... ఏర్పేడులో 20 కేసులు

కేవీబీపురం మండలం కాట్రపల్లి, మఠం గ్రామాల్లో కలుషిత ఆహారం తీసుకున్న కారణంగా వాంతులు, విరేచనాలతో 40 మంది అనారోగ్యానికి గురయ్యారు. వీరిని శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఇందులో కాట్రపల్లికి చెందిన రెండేళ్ళ చిన్నారి చికిత్స పొందుతూ మరణించింది. ఏర్పేడు మండలంలో గత నెల 18న మడిబాక దళితవాడ, అరుంధతి వాడల్లో అతిసార ప్రబలింది. తాగునీటి ట్యాంకులోకి వర్షపు నీరు చేరడంతో నీరు కలుషితమైంది. ఆ నీటిని వినియోగించడంతో 20 మంది అనారోగ్యానికి లోనయ్యారు. వైద్య సిబ్బంది గ్రామంలోనే శిబిరం ఏర్పాటు చేసి చికిత్సలు అందించారు.

ఐదేళ్ళలో నిర్లక్ష్యానికి గురైన తాగునీటి సరఫరా వ్యవస్థ

గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా వ్యవస్థ గత ఐదేళ్ళలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. తాగునీటి పైపులైన్ల మరమ్మతుల గురించి పట్టించుకున్న నాథుడు లేకుండా పోయారు. కనీసం తాగునీటి ట్యాంకులను శుభ్రపరిచే దిక్కు కూడా లేకపోయింది. దాని పర్యవసానం ఇపుడిపుడే జనానికి అనుభవంలోకి వస్తోంది. తాగునీటి పైపులైన్లు లీకేజీలకు గురి కావడం, పైపులైన్లు దెబ్బతినడంతో మురుగునీరు, వర్షపు నీరు పైపుల్లోకి చేరి నీరు కలుషితమవుతోంది.ట్యాంకులను శుభ్రపరచకపోవడం వల్ల కూడా నీరు కలుషితం కావడం, వర్షపు నీరు చేరడం జరుగుతోంది. ఇప్పుడైనా జిల్లా యంత్రాంగం యుద్ధప్రాతిపదికన స్పెషల్ డ్రైవ్ నిర్వహించి తాగునీటి పైపులైన్ల పరిస్థితిని తనిఖీ చేయించి అవసరమైన చోట్ల దిద్దుబాటు చర్యలు తీసుకోవాల్సిన తక్షణావసరముంది.



పాస్ మనో వికాస్ కేంద్రం

డయేరియాతో ఇద్దరు దివ్యాంగుల మృతి

రుయాలో చికిత్స పొందుతున్న 16మంది

పాస్ మనోవికాస్ కేంద్ర నిర్వాహకుల అలక్ష్యం

విచారణకు కలెక్టర్ ఆదేశం





శేషాచలం మృతదేహం

పాస్ మనో వికాస్‌కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు

తిరుపతి(కలెక్టరేట్/వైద్యం), జూలై 9 : వారంతా మానసిక దివ్యాంగులు. తిన్న ఆహారం సరిపడక వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిని ఆస్పత్రికి తరలించకుండా అందుబాటులో వున్న ఆయుర్వేద డాక్టరుతో వైద్యసేవలందించారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం ఒకరు, సోమవారం మరొకరు చనిపోయారు. వివరాల్లోకి వెళితే....తిరుపతి రూరల్ మండ లం పద్మావతిపురంలోని పాస్ మనోవికాస్ మానసిక దివ్యాంగుల ప్రత్యేక ఆశ్రమ పాఠశాలలో బాల బాలికలతోపాటు 30 ఏళ్ల వయస్సు పైబడిన మానసిక వ్యాధిగ్రస్థులు, అనాథలు కలిపి 72 మంది ఆశ్రయం పొందుతున్నారు. వీరిలో 22మంది అనాథలు కాగా మరో 52మంది మానసిక వ్యాధులతో బాధపడే దివ్యాంగులు ఉన్నారు. వీరికి ఆదివారం సాయంత్రం ఆశ్రమ నిర్వాహకులు బోండాలు, సాంబారు కలిపి ఆహారం పెట్టారు. సోమవారం తెల్లవారుజామున కొందరికి వాంతులు, విరోచనాలు కావడంతో ఆశ్రమంలో ఉన్న ఆయుర్వేద డాక్టరు మందులు ఇచ్చారు.వాంతులు, విరోచనాలు ఆగకపోగా గణపతి(30) అనే వ్యక్తి తీవ్ర అస్వస్థతకు గురికావడంతో అతడిని సోమవారం ఉదయం రుయాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షించి గణపతి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. దీంతో గణపతికి అయిన వారు ఎవరూ లేకపోవడంతో ఆశ్రమ పాఠశాల నిర్వాహకులే గణపతి మృతదేహాన్ని ఆదివారం సాయంత్రం ఖననం చేశారు. ఆశ్రమంలో ఉన్న మరికొందరికి కూడా వాంతులు, విరోచనాలు అవుతుండడంతో ఆశ్రమ నిర్వాహకులు అందుబాటులో ఉన్న ఆయుర్వేద వైద్యుడితో చికిత్స అందించారు. ఈ క్రమంలో తీవ్ర అస్వస్థతకు గురైన మరో అనాథ బాలుడు శేషాచలం(16) డయేరియా లక్షణాలతో మంగళవారం ఉదయం మృతిచెందాడు.ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పులివర్తి నాని అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ఆర్డీవో నిశాంత్‌రెడ్డి, డీపీవో సుశీలాదేవి, డీఎంహెచ్‌వో శ్రీహరి పాస్ మనోవికాస్ కేంద్రానికి చేరుకుని డయేరియా లక్షణాలతో బాధపడుతున్న కొంతమందిని ఆస్పత్రికి తరలించారు. మెడికల్ క్యాంపులు కూడా ఏర్పాటు చేశారు. రుయాలో 16మంది చికిత్స పొందుతుండగా వారిలో ప్రదీప్(20), తేజస్విని(25) అనే ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం స్విమ్స్‌కు తరలించారు. పాస్ మనోవికాస్ కేంద్రంలో అసలేం జరిగిందనే విషయంపై కలెక్టర్ వెంకటేశ్వర్ విచారణకు ఆదేశించారు.దీంతో అక్కడ ఆహార పదార్థాలను, తాగునీటిని పరీక్ష నిమిత్తం ల్యాబ్‌కు పంపారు.తాగునీరు కలుషితం కాలేదని మంగళవారం రాత్రికి కలెక్టర్‌కు నివేదిక అందింది. కాగా కలెక్టర్ వెంకటేశ్వర్ రుయాస్పత్రిలో చికిత్స పొందుతున్న మానసిక దివ్యాంగులను పరామర్శించారు.అలాగే పాస్‌మనోవికాస్ మానసిక దివ్యాంగుల ఆశ్రమాన్ని సందర్శించారు. ఇంతమంది తీవ్ర అస్వస్థతకు గురైనా జిల్లా యంత్రాంగానికి తెలియకుండా ఎందుకు వుంచారంటూ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆశ్రమంలోని వంటగదిని, తాగునీటిని పరిశీలించాక దీనిపై సమగ్ర విచారణ జరపాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 16మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని,వారి ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు.శనివారం బోండాలు తినడం వలనే తీవ్ర అస్వస్థతకు గురైనట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. తిరుచానూరు పోలీసులు కేసు నమోదు చేసి శేషాచలం మృతదేహాన్ని రుయా మార్చురీకి తరలించారు.



స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న ప్రదీప్

గంజాయి మత్తులో యువకుల వీరంగం

- నారాయణ విద్యాసంస్థల బస్సుపై మంగళంలో రాళ్లతో దాడి



ధ్వంసమైన బస్సు అద్దం



వీరంగం సృష్టించిన యువకులు

మంగళం, జూలై 9: గంజాయి మత్తులో ఇద్దరు యవకులు మంగళవారం సాయంత్రం నారాయణ విద్యాసంస్థకు చెందిన బస్సుపై మంగళంలో రాళ్లతో దాడి చేసి అద్దాలను పగులగొట్టారు. స్థానికులు, తిరుచానూరు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నారాయణ విద్యాసంస్థలకు చెందిన బస్సు 25 మంది విద్యార్థినులతో బయల్దేరింది. మంగళం బీటీఆర్ కాలనీ 16వ లైను వద్దకొచ్చేసరికి స్థానిక యువకులు బాలుప్రకాష్, మహేష్ అడ్డుగా నిలవడంతో డ్రైవర్ కుమార్ హారన్ కొట్టాడు. గంజాయి మత్తులో ఉన్న ఆ యువకులు అక్కడున్న రాళ్లను తీసుకుని బస్సు అద్దాలను పగులగొట్టారు. వాహనంలోని బాలికలు భయభ్రాంతులకు గురై కేకలు పెట్టారు. మరోవైపు డ్రైవర్ కుమార్‌ను కిందకు లాగి.. దుస్తులు చిరిగేలా కొట్టారు. అలాగే ఆ మార్గంలో వెళ్లే వాహనాలపైనా ఇలాగే దాడిచేస్తూ ఇబ్బందులు కల్గించారు. సమాచారం అందుకున్న మంగళం అవుట్ పోస్టు పోలీసులు అక్కడికి చేరుకుని, పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. బస్సులో ఉన్న విద్యార్థినులను వారి తల్లిదండ్రులకు సమాచారం అందించి వెంటపంపించారు. వీరంగం సృష్టించిన యువకులను, దాడికి గురైన బస్సును తిరుచానూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఐ శ్రీకాంత్‌రెడ్డి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

కిలో కందిపప్పు రూ.160

బియ్యం రూ.48, స్టీమ్డ్ రైస్ రూ.49

తిరుపతి, గూడూరు రైతు బజార్లలో రేపటినుంచి పంపిణీకి ప్రభుత్వం ఏర్పాట్లు

తిరుపతి(నేరవిభాగం), జూలై 9: పెరుగుతున్న నిత్యావసరాల ధరలకు కళ్లెం వేయడంలో భాగంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గురువారం నుంచి రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి తక్కువ ధరలకే కందిపప్పు, బియ్యం పంపిణీ చేయనుంది. ఇందులో భాగంగా తిరుపతి, గూడూరు రైతు బజార్లలో ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు కిలో రూ.170 పలుకుతోంది. రైతుబజార్ల ద్వారా కిలో రూ.160కే విక్రయించనున్నారు. స్టీమ్డ్ బియ్యం బహిరంగ మార్కెట్‌లో రూ.56-57 ఉండగా, రైతు బజార్లలో కిలో రూ.49కి విక్రయిస్తారు. బియ్యం బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.55-60 పలుకుతుండగా, రైతుబజార్లలో రూ.48కే విక్రయించనుంది. కాగా, జిల్లాకు దాదాపు ఐదు లక్షల టన్నుల కందిపప్పు అవసరం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం గోడౌన్లలో కేవలం లక్ష టన్నులు కూడా లేదని సమాచారం. అవసరమైన కందిపప్పును తెప్పించడానికి ట్రేడర్లు ముందుకు రావడం లేదని తెలిసింది.

తల్లిదండ్రులకు పారిపోయిన బాలికల అప్పగింత

తిరుపతి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఇళ్లలో చెప్పకుండా వచ్చేసి రైల్వే ట్రాక్‌పై అనుమానాస్పదంగా సంచరిస్తూ కనిపించిన బాలికలను పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించిన ఘటన రేణిగుంట మండలంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చెన్నైలో ఇరుగుపొరుగు కుటుంబాలకు చెందిన ఇద్దరు బాలికలు భవన నిర్మాణ పనులకు కూలీలుగా వెళుతుంటారు. అదే పనుల్లో పరిచయమైన ఓ యువకుడితో కలసి ముగ్గురూ మంగళవారం చెన్నై నుంచి రైలులో రేణిగుంట బయల్దేరారు. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో రైలు రేణిగుంట అవుటర్ సిగ్నల్ వద్ద ఆగడంతో ముగ్గురూ అక్కడ కిందకు దిగేశారు. రైలు వెళ్లిపోయాక ట్రాక్‌పై నడిచి వెళుతుండగా చూసిన కొందరు అనుమానంతో డయల్ 100కు ఫోన్ చేసి సమాచారమిచ్చారు. గాజులమండ్యం పోలీసులు వెళ్లేసరికి యువకుడు పరారయ్యాడు. బాలికలను పోలీసు స్టేషన్‌కు తరలించిన పోలీసులు విచారించి వివరాలు రాబట్టారు. ఇళ్లలో చెప్పకుండా వచ్చేసినట్టు తెలియడంతో వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసి నిర్ధారించుకున్నారు. పరారైన యువకుడి గురించి ఆరా తీయగా తమకు తెలిసిన వ్యక్తేనని బాలికలు చెప్పారు. ఎస్పీ ఆదేశాలతో మహిళా హెడ్ కానిస్టేబుల్‌ను రక్షణగా పెట్టి చెన్నైకి పంపించారు. ఓ బాలిక తల్లిదండ్రులు అందుబాటులో లేకపోవడంతో మరో బాలిక తల్లిదండ్రులకు ఇద్దరినీ అప్పగించారు. కాగా ఈ ఘటనకు సంబంధించి రేణిగుంట అవుటర్ సిగ్నల్ వద్ద రైలు దిగిన బాలికలపై గంజాయి మత్తులో ఉన్న ముగ్గురు యువకులు అత్యాచారానికి పాల్పడ్డారని, వెంట ఉన్న యువకుడిపై కూడా దాడి చేశారని ప్రచారం జరిగింది. ఈ విషయమై ఎస్పీ హర్షవర్ధన్ రాజును వివరణ కోరగా.. బాలికలపై అత్యాచారం జరిగిందన్నది తప్పుడు ప్రచారమని ఖండించారు. ఇళ్లలో చెప్పకుండా వచ్చిన బాలికలను క్షేమంగా వారి తల్లిదండ్రులకు అప్పగించడం జరిగిందని స్పష్టం చేశారు.

ఎర్రచందనం కేసులో ఏడాది జైలు

తిరుపతి(లీగల్), జూలై 9: ఎర్రచందనం కేసులో బీఎన్‌కండ్రిగమండలం కర్నిమిట్ట హరిజనవాడకు చెందిన సమ్మెట పెద్దగురవయ్యకు ఏడాది జైలుశిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ ఎర్రచందనం స్పెషల్‌కోర్టు న్యాయమూర్తి ఎస్.శ్రీకాంత్ మంగళవారం తీర్పు చెప్పారు. ఇతను 2016 మార్చి 12వ తేదీన శ్రీకాళహస్తి పరిధిలో ఓ వాహనంలో ఎర్రచందనం దుంగలు తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. కేసు నిరూపణ కావడంతో న్యాయమూర్తి ఏడాది జైలుశిక్ష విధించారు.

రేపటినుంచి పాలిసెట్ చివరి విడత కౌన్సెలింగ్

తిరుపతి(విద్య), జూలై 9: పాలిసెట్-2024 చివరి విడత కౌన్సెలింగ్ గురువారం నుంచి ప్రారంభం కానుందని తిరుపతి కో-ఆర్డినేటర్, ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. మొదటి విడతలో హాజరు కాలేకపోయిన విద్యార్థులు గురువారం నుంచి ఈనెల 13వ తేదీలోపు ఆన్‌లైన్లో నిర్దేశించిన రుసుం చెల్లించి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేసుకోవచ్చని సూచించారు. 11 నుంచి 14వ తేదీ వరకు ఆప్షన్ల నమోదు చేసుకోవాలన్నారు. 16వ తేదీన సీట్ అలాట్‌మెంట్ ఉంటుందని వెల్లడించారు. సీట్లు పొందినవారు ఈనెల 18 నుంచి 20వ తేదీలోపు ఆయా పాలిటెక్నిక్‌లలో రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.78 కోట్లు

తిరుమల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.78 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం లెక్కించి, మంగళవారం ఉదయం ప్రకటించింది. సోమవారం 63,619 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 28,572 మంది తలనీలాలు సమర్పించారు.

ఎన్టీఆర్ విగ్రహానికి దివ్యాంగుల పాలాభిషేకం


ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న దివ్యాంగులు

పాకాల, జూలై 9: స్థానిక ఆర్టీసీ బస్టాండు ఎదుట ఎన్టీఆర్ విగ్రహానికి మంగళవారం దివ్యాంగులు పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు దివ్యాంగుల పెన్షన్‌ను రూ.మూడు వేల నుంచి రూ.ఆరు వేలకు పెంచడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే పులివర్తి నానీలకు కృతజ్ఞతలు తెలిపారు. దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు జ్యోతీశ్వర్, కమిటీ సభ్యులు పి.మోహన్ బాబు, ఎన్.నరసింహారెడ్డి, లలిత, మునీంద్రబాబు, షౌకత్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎంలో కార్డు మార్చి రూ.40 వేల టోకరా

పాకాల, జూలై 9: స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎంలో మంగళవారం సాయంత్రం డబ్బు డ్రా చేయడానికి వెళ్లిన వ్యక్తిని బురిడీ కొట్టించి ఏటీఎం కార్డు మార్చి రూ.40 వేలు కాజేశారు. బాధితుడి కథనం మేరకు ఇరంగారిపల్లె పంచాయతీ ముద్దలపల్లెకు చెందిన బి.కస్తూరి బాబు చీటీ కట్టాలని తిరుపతిలో వున్న కుమారుడిని రూ.ఏడు వేలు డబ్బులు అడిగాడు. ఇంట్లో వున్న ఏటీఎం కార్డు ద్వారా డ్రా చేసుకోవాలని కుమారుడు చెప్పాడు. భార్యతో కలిసి కస్తూరి బాబు ఆర్టీసీ బస్టాండు ఎదుట వున్న ఎస్‌బీఐ ఏటీఎంకు వెళ్లి డ్రా చేసుకోవడానికి ప్రయత్నించాడు. ఏటీఎం పనిచేయలేదు. ఇదంతా గమనిస్తున్న సుమారు 50 ఏళ్ల వయసున్న వ్యక్తి ఇదే కేంద్రంలో వున్న మరో మిషన్‌లో ట్రై చేస్తానని కార్డు తీసుకున్నాడు. ఈ మిషన్‌లోనూ డబ్బు రాలేదని మరో కార్డు వీరి చేతికిచ్చి ఒరిజినల్ నొక్కేశాడు. రేపు తీసుకుందామని ఇంటి కెళ్లిన కాసేపటికే రూ.40 వేలు డ్రా అయినట్లు కుమారుడికి మెసేజ్ వెళ్లింది. దీంతో తండ్రిని ఏడు వేలు డ్రా చేసుకోమంటే రూ.40 వేలు తీసుకున్నావని కుమారుడు ప్రశ్నించాడు. అసలు నేను డబ్బులే డ్రా చేయలేదని చెప్పడంతో కార్డు చూసి మోసపోయామని గ్రహించారు. ఒరిజినల్ కార్డు స్థానంలో ఖాదం వెంకటరమణరావు పేరుతో కార్డు ఉండటంతో మోసపోయామని లబోదిబోమంటూ బాధితుడు పోలీస్ స్టేషన్‌కు పరుగులు తీశాడు.

వైభవంగా శ్వేత వారాహి హోమం


వారాహి అమ్మవారికి హారతి ఇస్తున్న రమ్యానందభారతి

రామచంద్రాపురం, జూలై 9: రాయలచెరువుకట్ట శ్రీశక్తి పీఠంలో వారాహి దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం వేదపండితులు వేదోక్తంగా వారాహిహోమం నిర్వహించారు. అమ్మవారికి తిరుమంజనం నిర్వహించి, లఘు వారాహి దేవిగా అలంకరించారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం అమ్మవారి ఊంజల్‌సేవ, రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. అనంతరం కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానందర భారతి స్వామి, శక్తి పీఠాధీశ్వరి భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు.

తాగునీటి పైపులైను లీకేజీ


లీకేజీ అవుతున్న తాగునీటి పైపులైను

రామచంద్రాపురం, జూలై 9: మండల కేంద్రమైన ఆర్‌సీపురంలో తాగునీటి పైపులైను లీకేజీ అయి ఆరు నెలలుగా నీరు వృధాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. అంటురోగాలు ప్రబలే ప్రమాదముంది.ఆర్‌సీపురం, వేమారెడ్డినగర్, రామాపురం ఎస్టీకాలనీ ప్రజల కోసం ఆరు నెలల క్రితం తాగునీటి పైపులైను ఏర్పాటు చేశారు. తిరుపతి-పచ్చికాపల్లం ప్రధానరహదారి ఆర్‌సీపురం మండల కేంద్రం పెట్రోల్‌బంకు వద్ద తాగునీటి పైపులైను పగిలి నీరు బయటకు వస్తోంది. నీటిని నిలుపుదల చేసిన సమయంలో గుంతలో ఉన్న మురుగునీరు పైపులైను లోపలకు వెళుతోంది. చాలా కాలంగా నీరు నిల్వ ఉండటంతో చెత్తా చెదారం చేరి మురుగుగుంతగా తయారైంది. ప్రభుత్వాధికారులు వివిధ కార్యాలయాలకు అటువైపే వెళుతున్నా ఎవరూ పట్టించుకోలేదు. అంటురోగాలు ప్రబలే ప్రమాదం ఉన్న నేపథ్యంలో అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీతో ఆదాయం పెంపు


మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఏడీ జగపతిరామయ్య

తిరుపతి రూరల్, జూలై 9: విలువ ఆధారిత మాంస ఉత్పత్తుల తయారీ ద్వారా ఆదాయాన్ని మరింతగా పెంచుకోవచ్చని ఎస్వీవెటర్నరీ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.జగపతిరామయ్య పేర్కొన్నారు. ఎస్వీవెటర్నరీ వర్సిటీలోని వెటర్నరీ కళాశాలలో పశు ఉత్పత్తుల సాంకేతిక శాస్త్రవిభాగం(ఎల్‌పీటీ) ఆధ్వర్యంలో ఐసీఏఆర్ ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో గ్రామీణ మహిళలకు విలువ చేకూరిత మాంస ఉత్పత్తుల తయారీలో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించడంపై మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వర్సిటీ డీన్ డాక్టర్ కె.వీరబ్రహ్మయ్యతో జగపతిరామయ్య కలసి శిక్షణను ప్రారంభించి మాట్లాడారు. ఉత్పత్తుల తయారీలో పాటించాల్సిన ప్రమాణాలు, మార్కెటింగ్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. వీరికి విభాగ హెడ్ డాక్టర్ జి.విజయభాస్కర్‌రెడ్డి నేతృత్వంలో శిక్షణ నిర్వహించారు. ఇందులో భాగంగా చికెన్ కట్‌లెట్స్, నగ్గెట్స్, సమోసాలు, చికెన్ ఇడ్లీలు, చికెన్ సూప్, మాంసపు సాజేసులు, కైమా ఉండలు, వడల తయారీ పద్ధతులపై మహిళలకు ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. శిక్షణలో పాల్గొన్న మహిళలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అధ్యాపకులు డాక్టర్ సుధీర్, డాక్టర్ జడ్ నవీన్, స్వయంసహాయక సంఘాల మహిళా సభ్యులు హాజరయ్యారు.

వ్యవసాయ కాలేజీలో అమ్మపేరుతో ఒకచెట్టు


ఎస్వీవ్యవసాయ కళాశాలలో మొక్కలు నాటుతున్న దృశ్యం

తిరుపతిరూరల్, జూలై 9: తిరుపతి ఎస్వీవ్యవసాయ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం అమ్మపేరుతో ఒకచెట్టు (ఏక్ పెడ్ మాకే నామ్ అభియాన్) కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాలలోని మామిడితోటలో అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంవీ రమణతో అధ్యాపకులు, విద్యార్థులు కలసి వివిధ రకాల మామిడి మొక్కలు నాటారు. ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ పి.గణేష్‌కుమార్, డాక్టర్ పి.శాంతి, డాక్టర్ బి.రమణమూర్తి, డాక్టర్ పి.కార్తీక్‌రెడ్డి, డాక్టర్ పి.నాగిరెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.


పద్మావతిపురంలోని పాస్ మనోవికాస్ ఆశ్రమాన్ని మంగళవారం పరిశీలిస్తున్న టీడీపీ నేతలు ఈశ్వర్‌రెడ్డి, అమిలినేని మధు, కత్తి సుధ, కిలారు వెంకటేష్, సుబ్రహ్మణ్యం నాయుడు

గుండ్లగుట్టపల్లెలో గంజాయి కలకలం

పాకాల, జూలై 9: మండలంలోని పేరసానిపల్లె పంచాయతీ గుండ్లగుట్టపల్లెలో మంగళవారం ఉదయం ఇద్దరు మహిళలు నివాసముంటున్న ఇంటిపక్కన బాత్‌రూమ్‌లో గంజాయి పొట్లాలను పోలీసులు గుర్తించారు. ఈ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు ఆ ఇంటివద్ద పరిశీలించి, గంజాయిని గుర్తించారు. ఎవరో కావాలనే తమను కేసులో ఇరికించాలని వాళ్లే పెట్టి పోలీసులకు సమాచారం అందించారని బాధిత మహిళలు వాపోతున్నారు. ఈ సంఘటన పరిసర గ్రామాల్లో కలకలం రేపింది. పది చిన్న పొట్లాలను గుర్తించి స్వాధీనం చేసుకోవడంతో అసలు గంజాయి ఎక్కడి నుండి వచ్చింది.. పోలీసులకు ఎవరు సమాచారం ఇచ్చారు.. దీని వెనకున్న వారెవరో తెలియాల్సి ఉంది.

20 ఏళ్లకు ఫలించిన బాబు సంకల్పం

చంద్రగిరి సీహెచ్‌సీలో ఎంఎల్సీ కేసులతో పాటు పోస్టుమార్టానికి అనుమతి



చంద్రగిరి, జూలై 9: ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పం దాదాపు 20 ఏళ్లకు ఫలించింది. చంద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధిలో మరో ముందడుగు పడింది. ఈ ఆరోగ్య కేంద్రంలో ఇకపై ఎంఎల్సీ, పోస్టుమార్టం నిర్వహించడానికి వైద్య శాఖ కమిషనర్ అనుమతులు జారీచేశారు. 1999లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ఆస్పత్రి కోసం భవనాన్ని మంజూరు చేశారు. భవన నిర్మాణం పూర్తయ్యేసరికి 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అప్పటి మంత్రిగా ఉన్న గల్లా అరుణకుమారి వంద పడకల ఆస్పత్రి భవనం ఖాళీగా ఉండటంతో కొంతమంది వైద్యులను నియమించి ఓపీలను ప్రారంభించారు. అప్పటినుంచి ప్రభుత్వ జీవోలు తప్పులు తడకగా రావడంతో 30 పడకల ఆస్పత్రిగానే వైద్య సేవలు అందించారు. 2019లో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ ఆస్పత్రికి ఇప్పటి ఎమ్మెల్యే పులివర్తి నాని 50 పడకల ఆస్పత్రిగా జీవో తీసుకొచ్చారు. ఆ జీవో అమలు కాకుండానే అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం 50 పడకల ఆస్పత్రికి సరిపడా వైద్యులు, సిబ్బందిని నియమిస్తూ, నాడు నేడు పథకం కింద పలు ఆధునికీకరణ పనులు చేపట్టింది. ప్రస్తుతం జనరల్ మెడిసిన్ వైద్యుడు మినహా జనరల్ సర్జన్, అనస్తీషియా, ఈఎన్‌టీ, ఆర్థో, చిన్న పిల్లల వైద్యులు, గైనిక్ డాక్టర్లు ఇద్దరు ఉన్నారు. అయితే ఇటీవల సూపరింటెండెంట్‌గా వచ్చిన డాక్టర్ అరుణ ఆస్పత్రిలో మెడికో లీగల్ కేసులు చూడటానికి, పోస్టుమార్టం నిర్వహించడానికి వైద్యశాఖ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపారు. దీంతో అనుమతులు మంజూరయ్యాయి. ఇప్పటికే అన్ని రకాల ఆపరేషన్లు, డెలివరీలు, తదితర వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ పథకం కూడా వర్తిస్తుంది. ఇక్కడ రోగులకు భోజన సౌకర్యం కల్పించాల్సి ఉంది. ఈ వారంలోనే చంద్రగిరి ఆస్పత్రిలో ఎంఎల్సీ కేసులు చూడనున్నారు. గతంలో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించడానికి తిరుపతి మెడికల్ కళాశాలకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. ఇకపై చంద్రగిరిలోనే పోస్టుమార్టం కూడా నిర్వహించనున్నారు. అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

శేషాచలం అడవుల్లోకి చొరబడుతున్న స్మగ్లర్లను అడ్డుకున్న టాస్క్‌ఫోర్స్

- ఇద్దరి అరెస్టు, కారు, రంపాలు, గొడ్డళ్ల స్వాధీనం


స్మగ్లర్లతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

చంద్రగిరి, జూలై 9: చంద్రగిరి మండలంలోని శ్రీనివాసమంగాపురం, శ్రీవారిమెట్టు సమీపంలో శేషాచలం అడవుల్లోకి చొరబడుతున్న కొందరు స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అడ్డుకుని, ఇద్దరిని అరెస్టు చేశారు. వారి నుంచి కారు, రంపాలు, గొడ్డళ్లు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జ్, తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఎస్ఐ విష్ణువర్ధన్‌కుమార్ మంగళవారం కళ్యాణిడ్యామ్ నుంచి శ్రీవారిమెట్టు వైపు కూంబింగ్ చేపడుతుండగా, నాగపట్ల సెక్షన్ పరిధిలో ఒక కారు నుంచి కొంత మంది వ్యక్తులు దిగడం కనిపించింది. దీంతో వారిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు చుట్టుముట్టే ప్రయత్నం చేయగా, పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిని వెంబడించి ఇద్దరిని పట్టుకున్నారు. వీరిని తమిళనాడు వేలూరు జిల్లా ఆనైకట్టుకు చెందిన శక్తివేల్, రాజేంద్రన్ చిన్నపయ్యన్‌లుగా గుర్తించారు. వారిని విచారించగా, తిరుపతి సమీపంలోని అడవుల్లో ఎర్రచందనం చెట్లను నరకడానికి అదే ప్రాంతానికి చెందిన రాజశేఖర్ అనే మేస్త్రీ తమను తీసుకువచ్చినట్లు తెలిపారు. వారి నుంచి కారు, రంపాలు, గొడ్డళ్లను స్వాధీనం చేసుకున్నారు. పారిపోయిన శెల్వరాజ్, రాజశేఖర్, గోపి, శీను, గోవిందన్‌ల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అడవుల్లోని అన్ని ప్రాంతాల్లోనూ స్మగ్లర్ల కోసం జల్లెడ పట్టారు. అరెస్టయిన నిందితులను తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకుని వచ్చి కేసు నమోదు చేయగా, సీఐ సురేష్ కుమార్ దర్యాప్తు చేస్తున్నారు. స్మగ్లర్లు అడవుల్లోకి వెళ్లి చెట్లను నరకకుండా సంరక్షించి, ముందస్తుగానే వీరిని పట్టుకోగలిగామని ఎస్పీ శ్రీనివాస్ తెలిపారు.



తలకోనలో అరుదైన కప్ప

మంగళం, జూలై 9 : ఎర్రావారిపాలెం మండల పరిధిలోని తలకోన జలపాతంలో అరుదైన గోధుమ వర్ణ చెవి పొదకప్పను జంతుశాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఈ కప్ప శరీరం పూర్తిగా గోధుమ వర్ణం కలిగి ఉంది. దశాబ్దాల క్రితం శ్రీలంకలో మనుగడ సాగించే స్యూడో ఫిలీటాస్ జాతికి చెందిన కప్ప ఇప్పుడు మన దేశంలోని తూర్పు కనుమల్లో కనిపించడం అంటే పూర్వం భారతదేశం, శ్రీలంక దేశాలు కలిసిఉన్నాయి అనడానికి నిదర్శనం అని జూలాజికల్ సర్వేఆఫ్ ఇండియా డైరెక్టర్ ధ్రితి బెనర్జీ అభిప్రాయపడ్డారు.

గుండేలిగుంటపై డయేరియా పంజా

శ్రీకాళహస్తి, జూలై 9: తొట్టంబేడు మండలం గుండేలిగుంట గిరిజన కాలనీపై డయేరియా పంజా విసిరింది. అదే సమయంలో గ్రామస్తులు గంగమ్మగా ఆరాధించే వేపచెట్టు మోడువారడంతో అందరిలో ఏదో అరిష్టం జరిగిందన్న అపోహ ఆవరించింది. వాంతులు, విరేచనాలు వీడకపోవడంతో నెలరోజుల క్రితం ఒక వృద్ధుడు, మరో ఏడాదిన్నర బాలుడు మృత్యువాత పడ్డారు. తమ దేవత ఆగ్రహించిందన్న మూఢ విశ్వాసంతో గ్రామంలోని పలు కుటుంబాలు ఇళ్లు విడిచి వెళ్లిపోయాయి. ఈ ఘటనపై వాస్తవాలను నిర్ధారించేందుకు అధికారుల బృందం మంగళవారం క్షేత్రస్థాయి పర్యటనలో పలు అంశాలను గుర్తించారు. కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇళ్ల మధ్యన మురుగునీరు తిష్ట వేసుకుంది. తాగునీటి చేతిబోరు వద్ద మురుగు పేరుకుపోయింది. అదే సమయంలో మండు వేసవిలో రెండు నెలల క్రితం గిరిజనులు భక్తిభావంతో ఆరాధించే గంగమ్మ వేపమాను ఎండిపోయింది. ఆ తరువాత కొద్దిరోజులకే గిరిజన కాలనీలో డయేరియా వ్యాప్తి చెందింది. ఈ క్రమంలో సుబ్రహ్మణ్యం(60) అనే వృద్ధుడు, ఏడాదిన్నర వయసున్న చరణ్ నెలరోజుల క్రితం మృతి చెందాడు. తమ దేవత ఆగ్రహించిన కారణంగానే గ్రామంలో అంటురోగం వెంటాడుతోందన్న ఆందోళనతో 13 కుటుంబాలు ఊరు విడిచి వెళ్లిపోయాయి. పాఠశాలలు తెరిచిన తరువాత విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో ఉపాధ్యాయులు ఆరాతీశారు. గుండేలిగుంట ఎస్టీ కాలనీలో కొన్ని కుటుంబాలు ఊరు విడిచివెళ్లిపోయినట్లు గుర్తించారు. ఇది సామాజిక మాధ్యమాల ద్వారా వెలుగులోకి రావడంతో మంగళవారం పత్రికల్లో ప్రచురితమైంది. తొట్టంబేడు తహసీల్దారు శివరాముడు, ఎంపీడీవో ప్రవీణ్ అధికారులతో కలిసి కాలనీలో పర్యటించారు. డ్రైనేజీ వ్యవస్థ లేకపోడం, చేతిబోరు వద్ద పారిశుధ్య లోపాన్ని గుర్తించారు. తాగునీటి బోరు మోటారు వద్ద పైపు పగలడంతో నీరు కలుషితం అవుతోందని ప్రాథమికంగా అంచనా వేశారు. తాగునీటి నమూనాలను ల్యాబ్‌కు తరలించారు. ఆరు నెలల క్రితం సిమెంట్ రోడ్డు నిర్మించిన కారణంగా వేపచెట్టు ఎండిపోయి ఉండవచ్చని గ్రామస్తులకు వివరించారు.

అచ్చెన్నాయుడిని కలిసిన టీడీపీ నేతలు



తిరుపతి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, మంత్రి అచ్చెన్నాయుడిని మంగళవారం తిరుపతి టీడీపీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలోని ఆయన నివాసంలో కలసి శ్రీవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బుల్లెట్ రమణ తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలన అందిస్తున్న బాబు : మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ

తిరుపతి(ఆటోనగర్), జూలై 9: రాష్ట్రాభివృద్ధి దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే ఎం.సుగుణమ్మ పేర్కొన్నారు. ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెల రోజులు గడవక ముందే అవసరమైనవి పరిష్కరించినట్లు స్పష్టం చేశారు. మూడు నెలల అరియర్స్‌తో కూడిన అవ్వా, తాతల పింఛన్లు, ల్యాండ్ టైటిల్ చట్టం మినహాయింపు, ఉచిత ఇసుక పంపిణీ చేయడానికి ప్రభుత్వం 43 జీవోను జారీ చేసిందన్నారు. దీంతో పేదలు కూడా తక్కువ ఖర్చుతో గృహనిర్మాణ పనులు చేసుకొనే వెసులుబాటు కలిగిందన్నారు. పార్టీలో ప్రారంభం నుంచి సేవలందించిన వారికి పదవులు వస్తాయని పేర్కొన్నారు. నాయకులు సూరా సుధాకర్‌రెడ్డి, దంపూరు భాస్కర్ యాదవ్, కంకణాల రజనీకాంత్ నాయుడు, ఊట్ల సురేంద్ర నాయుడు, మన్యం శ్రీనివాసులు, ఆముదాల తులసీరాం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను పటిష్ఠంగా అమలు చేస్తాం

టీడీపీ నేత నరసింహ యాదవ్

తిరుపతి(ఆటోనగర్), జూలై 9: ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ప్రకటించిన పథకాలను పటిష్ఠంగా అమలు చేస్తామని తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు జి.నరసింహ యాదవ్ వెల్లడించారు. ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఇసుకను వ్యాపారంగా మార్చుకొని కోట్లు దండుకుందని ఆరోపించారు. ప్రజల అవసరాలకు ఉపయోగపడే ఈ పథకంలో ఎక్కడా పొరపాట్లు జరుగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. టీటీడీలో జరిగిన అక్రమాలపై సీఐడీతో విచారణ చేయిస్తామన్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వం అనుసరించిన ఇసుక మాఫియాపై, నగర పరిధిలో చేపట్టిన 14 రోడ్లకు సంబంధించిన నిధుల వినియోగంపై కూడా విచారణ జరిపిస్తామని చెప్పారు. మనోహర్ ఆచారి, ఈతమాకుల హేమంత్‌కుమార్, ఊట్ల సురేంద్ర నాయుడు, కె.జయరాం, మహేష్, బాలు, చెంగయ్య, యశ్వంత్‌రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు


హీరాలాల్ సమరియా - విద్యాసాగర్ - గణేష్ వెంకట్‌రామన్

తిరుమల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో- తిరుపతి ఎంపీ గురుమూర్తి, చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ హీరాలాల్ సమరియా, జనసేన ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, పంతం వెంకటేశ్వరరావు, సంగీత దర్శకుడు విద్యాసాగర్, సినీనటుడు గణేష్ వెంకట్ రామన్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

అన్నప్రసాద తయారీని ఆధునికీకరించండి

- సిబ్బందికి శిక్షణ ఇవ్వడంతో పాటు ఇన్‌హౌస్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయండి
- టీటీడీకి పాకశాస్త్ర నిపుణుల సూచన


పాకశాస్త్ర నిపుణులతో సమావేశంలో టీటీడీ ఈవో,జేఈవో తదితరులు

తిరుమల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి భక్తులకు మరింత రుచికరమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించడానికి అన్నప్రసాద తయారీ విధానాన్ని ఆధునికీకరించాలని ప్రఖ్యాత పాకశాస్త్ర నిపుణులు టీటీడీకి సూచించారు. తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలో మంగళవారం సాయంత్రం టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, దక్షిణ భారతదేశ చెఫ్స్ అసోసియేషన్ బృందంతో కలిసి అన్నప్రసాదం, వంటశాలల ఆధునికీకరణ తదితర అంశాలపై టీటీడీ ఈవో శ్యామలరావు సుదీర్ఘంగా చర్చించారు. అంతకు ముందు తిరుమలలోని వెంగమాంబ అన్నప్రసాద కేంద్రాన్ని సందర్శించిన చెఫ్స్ బృందం అన్నప్రసాదాలు వడ్డించడం, నిల్వ చేయడం, శుభ్రపరచడం తదితర కార్యకలాపాలను పరిశీలించింది.రోజురోజుకూ పెరుగుతున్న అసంఖ్యాక భక్తుల అవసరాలకు అనుగుణంగా వంటశాలను ఆధునికీకరించాలని సూచించింది.అన్నప్రసాద భవన సిబ్బందికి శిక్షణ ఇవ్వడం ద్వారా వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించడం, ఇన్‌హౌస్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసి తనిఖీ చేయడం, ఆహార పదార్థాల పరిశుభ్రత, వ్యర్థ పదార్థాల నిర్వహణ, పరికరాల యాంత్రీకరణ, ఆహారాన్ని రుచికరంగా, వేగవంతమైన పద్ధతిలో తయారు చేయడం, మూడు నెలలకోసారి ఫుడ్ అనలిస్టులతో సూచనలు తీసుకోవడం వంటి అనేక సూచనలు చేశారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లపై పక్కా ప్రణాళికను రూపొందించి మరోసారి అన్నప్రసాద కార్యకలాపాలపై ఆహారనిపుణులతో త్వరలో సమావేశం నిర్వహించనున్నట్టు ఈవో తెలిపారు. జీఆర్‌టీ గ్రూప్ ఆఫ్ హోటల్స్ సీఈవో విజయ్ విక్రమ్ కోటా, సౌతిండియా చెఫ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ దామోదరన్, చెఫ్ తిరులోక్‌చందర్,తిరుపతిలోని ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్ హెడ్ చెఫ్ సీతారామ్ ప్రసాద్, కిచెన్ కన్సల్టెంట్స్, డిజైనర్ రితేష్ చౌదరీ, దీపక్, నితీష్, టీటీడీ డిప్యూటీఈవో రాజేంద్ర, క్యాటరింగ్ ఆఫీసర్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

వాహన చోదకులు 'జరభద్రం'

- మళ్లీ కుంగుతున్న రేణిగుంట రోడ్డు

తిరుపతి అర్బన్, జూలై 9: రేణిగుంట ప్రధాన మార్గంలోని ఉప్పరపాళెం క్రాస్ నుంచి దాదాపు 200మీటర్ల వరకు రోడ్డు కుంగిపోయి పెద్ద పెద్ద రంధ్రాలు ఏర్పడ్డాయి. గతంలో వేసిన అండర్‌డ్రైనేజీ పైపుల పైభాగాన ఇతర కేబుళ్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తవ్విన గాడిని మొక్కుబడిగా పూడ్చారు. దాంతో గతేడాది కూడా రోడ్డు కుంగిపోవడం, వర్షపునీరు ప్రవహించడంతో మట్టి కొట్టుకుపోయి పెద్ద పెద్ద రంధ్రాలు ఏర్పడ్డాయి. అప్పట్లో సంబంధిత విభాగం అధికారులు స్పందించి రంధ్రాలను పూడ్చి రహదారికి మరమ్మతులు చేశారు. ఇటీవల వర్షాలు కురుస్తుండటంతో నారాయణాద్రి హాస్పిటల్ నుంచి ఉప్పరపాళెం క్రాస్ వరకు అక్కడక్కడ పెద్ద పెద్ద రంధ్రాలు ఏర్పడ్డాయి. రాత్రి వేళ పొరపాటున రోడ్డు అంచుల్లో ద్విచక్ర వాహనాలు నడిపితే పడిపోవాల్సిందేనని వాహన చోదకులు భయాందోళన చెందుతున్నారు. అడ్డుగా ట్రాఫిక్ బోర్డులు, టైర్లు, రాళ్లు పెట్టినా పెద్దగా ఉపయోగం లేదని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


రేణిగుంట మార్గంలో ఉప్పరపాళెం క్రాస్ వద్ద కుంగిపోతున్న రహదారి

దోపిడీ కేసులో ముగ్గురికి ఐదున్నరేళ్ల జైలుశిక్ష

తిరుపతి(నేరవిభాగం), జూలై 9: దోపిడీ కేసులో ముగ్గురికి ఐదున్నరేళ్ల జైలు శిక్ష విధిస్తూ చిత్తూరు అదనపు సీనియర్ న్యాయమూర్తి వెన్నెల మంగళవారం తీర్పు చెప్పారు. అలిపిరి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడు రాష్ట్రం విల్లుపురం జిల్లా, తిరుక్కోవిలూరుకు చెందిన సంగం రాజా, తిరుప్పూర్ జిల్లా పుదూరుకు చెందిన దొరైస్వామి, చెన్నై మెరీనా బీచ్‌కు చెందిన యాచకుడు ఖాజా మొహిద్దీన్ షాజహాన్ గత ఏడాది అక్టోబరు 11న అలిపిరి లింక్ బస్టాండులో మొబైల్ యాక్సెసరీస్ అమ్ముకుంటున్న మంగళంకు చెందిన పి.అనీష్ వద్దకు వచ్చారు. అనీష్‌ను బెదిరించి అతడి వద్ద ఉన్న డబ్బు, మొబైల్ యాక్సెసరీస్ ఇవ్వాలని బెదిరించారు. అతను ఇవ్వక పోవడంతో తమ వద్ద ఉన్న ఇనుప రాడ్లు, కత్తులు, బ్లేడ్లతో దాడిచేసి.. రూ.13వేలతోపాటు రూ.4వేల విలువైన మొబైల్ యాక్సెసరీస్ తీసుకుని పరారయ్యారు. ఈ దాడిలో అనీష్‌కి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదుతో అప్పటి అలిపిరి సీఐ అబ్బన్న కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితులను అక్టోబరు 14న అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నేరం నిరూపణ కావడంతో ఒక్కొక్కరికి ఐదున్నరేళ్ల జైలు శిక్ష, రూ.3000 జరిమానా విధిస్తూ మంగళవారం న్యాయమూర్తి తీర్పు చెప్పారు. కేసును ఛేదించిన అప్పటి అలిపిరి సీఐ అబ్బన్న, ఎస్ఐ జయచంద్ర, ఏపీపీ శైలజ, కానిస్టేబుళ్లు ప్రభాకర్, నాగరాజులను ఎస్పీ హర్షవర్ధన రాజు అభినందించారు.

తాళం వేసిన ఇంట్లో భారీ చోరీ

శ్రీకాళహస్తి, జూలై 9: శ్రీకాళహస్తి పట్టణం దక్షిణకైలాస్ నగర్ కాలనీలోని ఓ ఇంట్లో సోమవారం రాత్రి భారీ చోరీ జరిగింది. టూటౌన్ సీఐ రారాజు కథనం మేరకు.... పట్టణానికి చెందిన సిరాజ్ ఉన్నీసా తన కుమారుడితో కలిసి దక్షిణకైలాస్ నగర్ కాలనీలో అద్దె ఇంట్లో నివసిస్తోంది. ఆమె కుమార్తె, అల్లుడు చెన్నైలో ఉద్యోగం చేస్తున్నారు. ఇటీవల కూతురు, అల్లుడు తమిళనాడులోని వేర్వేరు ప్రాంతాలకు బదిలీ అయ్యారు. దీంతో సిరాజ్ ఉన్నీసా బంగారు ఆభరణాలను శ్రీకాళహస్తిలోని తన తల్లి వద్ద భద్రపరిచింది. ఆదివారం సిరాజ్ ఉన్నీసా కొడుకుతో కలిసి చెన్నైలోని కుమార్తె ఇంటికి వెళ్లింది. సోమవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు తలుపులు పగులగొట్టి ఆమె ఇంట్లోకి ప్రవేశించారు. బీరువాలోని 40 సవర్లు(320) గ్రాములు బంగారు ఆభరణాలు, 900 గ్రాముల వెండి వస్తువులు, రూ.3.50లక్షల నగదు దోచుకెళ్లారు. మంగళవారం ఇంటి తలుపులు తెరచి ఉండటాన్ని పొరు గింటివారు గమనించి చెన్నైలో ఉన్న సిరాజ్ ఉన్నీసాకు సమాచారం అందించారు. ఆమె కొడుకుతో పాటు శ్రీకాళహస్తికి చేరుకుని ఇంటిని పరిశీలించారు. చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ రారాజు ఘటనా స్థలానికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. తిరుపతి నుంచి క్లూస్‌టీం బృందం వచ్చి వేలిముద్రల నమూనాలను సేకరించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు చోరీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పోలీసుల అదుపులో ఎన్ఆర్ఐ కిడ్నాపర్లు

శ్రీకాళహస్తి, జూలై 9: ఎన్ఆర్ఐను కిడ్నాప్ చేసిన కేసులో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. శ్రీకాళహస్తి పట్టణ శివారులోని రాజీవ్‌నగర్ వద్ద తిరుపతికి చెందిన ఎన్ఆర్ఐ హరికృష్ణను కొందరు కిడ్నాప్ చేసిన విషయం తెలిసిందే. సోమవారం రాత్రి ఆయన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తిరుపతికి చెందిన ఇద్దరు కిడ్నాపర్లను మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఇందులో పాత్రధారులైన మరికొందరి కోసం గాలింపు కొనసాగిస్తున్నారు.

ప్రభుత్వం మారాక నేడు తొలి 'కౌన్సిల్' మీట్

● కార్పొరేషన్ ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ప్రమాణం చేయనున్న ఎమ్మెల్యే ఆరణి
● తిరుపతి కౌన్సిల్‌ని ఎంపిక చేసుకున్న ఎంపీ గురుమూర్తి



తిరుపతి, ఆంధ్రజ్యోతి

తిరుపతి కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం దాదాపు ఆరు నెలల తర్వాత జరగనుంది. ఎన్నికలకు ముందు వైసీపీ ప్రభుత్వ హయాంలో జనవరి 18న చివరి సమావేశం జరిగింది. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు తొలి సమావేశం జరగనుంది. ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అనంతరం కౌన్సిల్ సమావేశం మొదలుకానుంది. అదే విధంగా వైసీపీ ఎంపీ గురుమూర్తి ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఉండేందుకు తిరుపతి కౌన్సిల్‌ను ఎంపిక చేసుకున్నారు. ఆమేరకు కమిషనర్ అదితిసింగ్‌కు లేఖ రాశారు. గత ప్రభుత్వంలో అప్పటి వైసీపీ ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి మాత్రమే కౌన్సిల్లో ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఉన్నారు. అప్పుడు కూడా ఎంపీగా గురుమూర్తి ఉన్నారు. వైసీపీ అధిష్ఠానం సూచనలతో శ్రీకాళహస్తి లేదా గూడూరు మున్సిపల్ కౌన్సిల్లో ఉండాలని భావించారు. ఎక్స్అఫిషియో సభ్యులకు కౌన్సిల్లో ఓటు హక్కు ఉంటుంది కాబట్టి తిరుపతికి పూర్తిస్థాయి మెజారిటీ వైసీపీకి ఉండడంతో అప్పటికి ఎన్నికలు జరగని శ్రీకాళహస్తి, గూడూరులో ఎంపీ ఓటు అవసరమవుతుందని భావించి పార్టీ ఆ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. అయితే వాటి కౌన్సిల్ ఎన్నికలు వాయిదా పడడంతో ఎంపీ ఎక్కడ కూడా ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఉండలేదు. ఇపుడు తిరుపతి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, డిప్యూటీ మాజీ మేయర్ భూమన అభినయ్ ఓడిపోవడంతో తిరుపతి కౌన్సిల్‌ను ఎంపీ ఎంపిక చేసుకున్నారు. ఆయన అందుబాటులో ఉంటే ఎమ్మెల్యేతోపాటు ఎక్స్అఫిషియో సభ్యుడిగా ప్రమాణం చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

కొత్త ప్రభుత్వంలోనైనా మేయర్‌కి గౌరవం దక్కేనా?

గత ప్రభుత్వ హయాంలో కౌన్సిల్ సమావేశం భిన్నంగా జరిగేది. అప్పటి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి తమ పార్టీకే చెందిన మేయర్ డాక్టర్ శిరీష పక్కన కూర్చొని సమావేశమంతా తానే నడిపించేవారు. మేయర్‌కు కుడి, ఎడమలుగా ఎమ్మెల్యేతోపాటు కమిషనర్ కూడా కూర్చోవడం అనేక ఆరోపణలకు తావిచ్చింది. ఇపుడు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆరణి ఎలా వ్యవహరిస్తారో చూడాల్సి ఉంది.

34 అజెండా అంశాలతో..

కౌన్సిల్ సమావేశంలో 34 అజెండా అంశాలను తీసుకురానున్నారు. కాలువలు పూడికతీయడం, డ్రైనేజీలు శుభ్రంచేయడం, పాడైన రోడ్లు వేయడం, లీజు గడువు ముగిసిన షాపులను కొనసాగించడం వంటి వాటిపై చర్చ జరగనుంది.

కండలేరు పూడికతీస్తేనే తిరుపతికి నీళ్లు

తిరుపతి, యాత్రికుల తాగునీటి అవసరాలకు కండలేరు జలాశయంలోని డెడ్ స్టోరేజీ నీటిని 100 రోజులు పంపింగ్ చేయడానికి కార్పొరేషన్ రూ.17కోట్ల అంచనాలను తయారు చేసి మార్చి 26న ప్రభుత్వానికి కార్పొరేషన్ లేఖ రాసింది. నిధులు మంజూరు చేయడం సాధ్యపడదని, కార్పొరేషన్ సాధారణ లేదా 15వ ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్ల నుంచి వినియోగించుకోవాల్సిందిగా మే 17న ఉత్తర్వులను ప్రభుత్వం విడుదలచేసింది. అయితే కార్పొరేషన్లో అంత నిధులు లేకపోవడంతో తెలుగుగంగ చీఫ్ ఇంజనీరు సూచనతో రూ.85లక్షలతో కండలేరు జలాశయంలో పూడికతీసి.. గ్రావిటీ ద్వారా నీటిని విడుదల చేయడంతో కార్పొరేషన్‌కు భారం తగ్గుతుందని భావించింది. దీనికిగాను రూ.85లక్షల మంజూరుకు నేడు కౌన్సిల్ అజెండాలో తీర్మానం చేయనున్నారు.

అజెండాలో కొన్నిముఖ్యమైనవి

- రూ.56 లక్షలతో లక్ష్మీపురం సర్కిల్, రామానుజాచార్య, ఆర్టీసీ బస్టాండు సర్కిల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు.
- నిర్మాణంలో ఉన్న కమిషనర్ బంగ్లాకు ఫ్లోరింగ్, ఉడ్‌వర్క్, కాంపౌండ్ వాల్, ఇతరత్రా పనులకు మరో రూ.2కోట్ల మంజూరు.
- కార్పొరేషన్ అధికారులకు అద్దెకు పెట్టిన 23 వాహనాలను ఏడాదిపాటు రెన్యువల్ చేస్తూ అవసరమైన సుమారు కోటి రూపాయల మంజూరు.
- మూడేళ్లుగా దారికి నోచుకోని శ్రీనివాసం ఎదురుగా పీకే లేఅవుట్ ప్రాంతానికి సిమెంటు రోడ్డు కోసం రూ.38లక్షలు.
- పారిశుధ్య కార్మికులకు యూనిఫాం, చెప్పులు, కొబ్బరినూనెకు రూ.87లక్షలు.
- 35వ డివిజన్లో యూడీఎస్ లైన్లు మార్చడానికి, రోడ్లు డ్యామేజీ అయిన చోట్ల కొత్తగా సిమెంటు రోడ్లు వేయడానికి రూ.40లక్షలు, జర్నలిస్టు కాలనీలో రోడ్లకోసం రూ.22లక్షలు.
- వీధి కుక్కలకు ఆపరేషన్లు, యాంటీ రేబీస్ వ్యాక్సిన్లు వేయడం కోసం ప్రతి కుక్కకు రూ.1200 చొప్పున చెల్లించేలా నగరంలోని 3,300 కుక్కలకు సుమారు రూ.40లక్షలు.
- డీఅడిక్షన్ సెంటర్లో పనిచేసేవారికి జీతాల కోసం ఏడాదికి రూ.12లక్షలు.
- స్విమ్స్ ఆస్పత్రి ఎదురుగా ఉన్న షాపుల లీజు కాలం పొడిగింపు నిర్ణయం.
- ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్టు షాపింగ్ కాంప్లెక్స్‌లోని 66 షాపులకు మార్చి 31కు లీజు కాలం ముగిసింది. మూడేళ్ల లీజు పొడిగించాలని అర్జీలు పెట్టుకున్నారు. దీంతో 24 ఏళ్లుగా ఉన్న షాపులను మరో మూడేళ్లు పొడిగింపు.
- అన్న క్యాంటీన్ల పునరుద్ధరణకు చర్యలు. గతంలో కేటాయించిన లీజును రద్దుచేస్తూ నిర్ణయం.
- రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ సాంబశివన్ టౌన్ ప్లానింగ్ విభాగంలో అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్నారు. మరో ఏడాదిపాటు ఆయన్ను పొడిగిస్తూ,ఏడాదికి జీతం రూ.6లక్షలిచ్చేలా నిర్ణయం.
- కార్పొరేటర్ల విజ్ఞప్తి మేరకు నగరంలో అల్లూరి సీతారామ రాజు విగ్రహం ఏర్పాటు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోండి: కమిషనర్



తిమ్మినాయుడు హరిజనవాడలో పర్యటిస్తున్న కమిషనర్ అదితిసింగ్

తిరుపతి (జీవకోన), జూలై 9: తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు కమిషనర్ అదితిసింగ్ సూచించారు. మంగళవారం తెల్లవారుజాము నుంచి తిమ్మినాయుడుపాళెం, హరిజనవాడ, రెడ్డిగుంట, ఉప్పరపాళెం తదితర ప్రాంతాల్లో హెల్త్, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఆమె పర్యటించారు. పారిశుధ్య పనులు, తాగునీటి సరఫరాను తనిఖీ చేశారు. డెంగ్యూ, డయేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా తాము ఎన్ని చర్యలు చేపట్టినా ప్రజల సహకారం కూడా ఉండాలన్నారు. అధికారులు విజయకుమార్‌రెడ్డి, యువఅన్వేష్ రెడ్డి, చెంచయ్య, సుమతి తదితరులు పాల్గొన్నారు.

అరకొర సౌకర్యాలతో పనిచేయలేం

ఎస్డీఎంకు విన్నవించిన ఎల్ఐసీ ఏజెంట్లు

తిరుపతి(లీగల్), జూలై 9: కరకంబాడి రోడ్డులోని ఎల్ఐసీ బ్రాంచ్-2లో అరకొర సౌకర్యాలతో పనిచేయలేమని సుమారు వందమంది ఏజెంట్లు సీనియర్ డివిజన్ మేనేజర్ (ఎస్డీఎం) ప్రసాదరావుకు విన్నవించారు. మంగళవారం జరిగిన సమావేశంలో పలువురు ఏజెంట్లు మాట్లాడారు. ఊరు బయట పెట్టడం పాలసీదారులకు ఇబ్బందికరంగా మారిందన్నారు. సిబ్బంది కూడా ఆఫీసు సమయంలో అందుబాటులో ఉండటం లేదని, సేవలు పారదర్శకంగా లేవని వాపోయారు. మార్కెటింగ్ మేనేజర్ కృష్ణమూర్తి, బ్రాంచ్ మేనేజర్ విజయలక్ష్మిల ముందే ఏజెంట్లు తమ బాధలను చెప్పుకున్నారు.

12నుంచి కావమ్మ - మారయ్య కథాగానం

తిరుపతి (కల్చరల్) జూలై 9: బెస్తవీధిలోని కావమ్మ- మారయ్య ఆలయంలో ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు కావమ్మ-మారయ్య కథాగానం జరుగుతుందని ఆలయ నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 12న ఉదయం 8గంటలకు అభిషేకం, పూజలు.. రాత్రి 9 గంటలకు కథ ప్రారంభం. 13వతేదీ రాత్రి కూడా కథ జరుగుతుంది. ఈ సందర్భంగా సారె పంచడం జరుగుతుంది. 14వ తేదీ రాత్రి కథ ముగింపు, అగ్ని గుండప్రవేశం ఉంటాయని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

యూడైస్ వివరాలను నమోదు చేయండి : ఆర్ఐవో



సమావేశంలో ప్రసంగిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

తిరుపతి(విద్య), జూలై 9: విద్యార్థుల యూడైస్ వివరాలను వెంటనే నమోదు చేయాలని ఇంటర్మీడియట్ విద్యామండలి ప్రాంతీయ పర్యవేక్షణాధికారి (ఆర్ఐవో) జీవీ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. ప్రైవేటు కళాశాలల ప్రిన్సిపాళ్లతో ఎస్వీ జూనియర్ కళాశాలలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఆదివారం తరగతులు నిర్వహిస్తే రూ.లక్ష అపరాధ రుసుం విధించడంతోపాటు కళాశాల అనుమతి రద్దు చేస్తామని హెచ్చరించారు. క్రమం తప్పకుండా తనిఖీలు ఉంటాయని, నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలు తప్పని స్పష్టం చేశారు.

విధినైనా ఎదిరించి.. విజయం సాధించాలి: డీఈవో



దివ్యాంగ విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేసిన డీఈవో శేఖర్

తిరుపతి(విద్య), జూలై 9: విధినైనా ఎదిరించి.. విజయం సాధించాలని దివ్యాంగ విద్యార్థులకు జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) వి.శేఖర్ పిలుపునిచ్చారు. పదో తరగతి ఉత్తీర్ణులైన దివ్యాంగ విద్యార్థుల అభినందన కార్యక్రమం ఎంజీఎం పాఠశాలలోని భవిత కేంద్రంలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. టెన్త్ ఉత్తీర్ణులైన 28 మంది దివ్యాంగ విద్యార్థులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేసి, అభినందించారు. జిల్లా సహిత విద్య సమన్వయకర్త చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపతి అర్బన్, రూరల్ ఎంఈవోలు బాలాజి, భాస్కర్ నాయక్, ఎంజీఎం పాఠశాల హెచ్ఎం ఎ.మురుగన్, వుయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ తహసున్నీసా, వేమన విజ్ఞానకేంద్రం ఫౌండర్ నాగార్జున, బాలోత్సవ్ అధ్యక్షుడు నారాయణ, భవిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రుయాలో ఇదేమి వైద్యం?



వృద్ధురాలిని నేలపై పడుకోబెట్టి ఈసీజీ పరీక్ష చేస్తున్న సిబ్బంది

తిరుపతి(వైద్యం), జూలై 9: రుయాస్పత్రిలోని ఎఫ్ఎం వార్డులో చికిత్స పొందుతున్న ఓ వృద్ధురాలిని మంగళవారం నేలపై పడుకోబెట్టి ఈసీజీ పరీక్ష చేసేశారు. ఇదేంటని అక్కడున్న మిగిలిన రోగులకు అడిగితే పడకలు అందుబాటులో లేవని.. తప్పని పరిస్థితిలో ఇలా చేయాల్సి వచ్చిందని సిబ్బంది చెప్పడం గమనార్హం.

దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వోకు అభినందనలు

తిరుపతి(సెంట్రల్), జూలై 9: దక్షిణ మధ్య రైల్వే ముఖ్య ప్రజాసంబంధాల అధికారి(సీపీఆర్వో) ఎ.శ్రీధర్‌కు మంగళవారం పలువురు అధికారులు అభినందనలు తెలిపారు. వీరిలో స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, ఎస్ఎంఆర్ చిన్నప్పరెడ్డి, వివిధ శాఖల అధికారులు ఉన్నారు. ఇక్కడ పనిచేస్తున్న సీహెచ్ రాకేష్.. డిప్యూటీ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్(ట్రాఫిక్ అండ్ ఆర్పీఎఫ్)గా బదిలీ అయ్యారు.

తోపుడు బండ్ల వ్యాపారులకు అన్యాయం చేయొద్దు: సీఐటీయూ

తిరుపతి(ఆటోనగర్), జూలై 9: కరకంబాడి మార్గంలో తోపుడు బండ్లు పెట్టుకొని జీవిస్తున్న చిరువ్యాపారులకు అన్యాయం చేయొద్దని సీఐటీయూ నాయకులు వేణుగోపాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికార పార్టీకి చెందిన కొందరు దాడులు చేస్తున్నారని, కూటమి ప్రభుత్వం సాయం చేయాలని కోరారు. లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

తిరుపతిలో గంజాయిని అరికట్టండి

● డీజీపీకి మధుసూదన్ వినతి

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూలై 9: తిరుపతిలో గంజాయిని అరికట్టాలని డీజీపీ ద్వారకా తిరుమలరావును బీజేపీ రాష్ట్ర నేత జల్లి మధుసూదన్ కోరారు. డీజీపీని మంగళవారం విజయవాడలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు.

ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం



కాగడాల ప్రదర్శన నిర్వహిస్తున్న కార్యకర్తలు

తిరుపతి(విద్య), జూలై 9: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆవిర్భావ దినోత్సవం తిరుపతి శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరిగింది. కార్యకర్తలు నగరంలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థి సంఘం కార్యకర్తలు సుమన్, పూజా రాఘవేంద్ర, సురేంద్ర, సోమశేఖర్, వెంకటరమణయ్య, లక్ష్మీనారాయణ, నరేంద్ర, ఉమేష్, పవన్, పూర్వ కార్యకర్తలు శ్రీధర్, సామంచి శ్రీనివాస్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ



తిరుపతి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నగరంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. చిన్నపాటి వర్షానికే రోడ్లపై మురుగు ప్రవహిస్తోంది. కార్పొరేషన్ యంత్రాంగం ఓవైపు రోజూ పర్యటిస్తోంది. చర్యలు తీసుకుంటున్నట్టు కనిపిస్తోంది. అయినా జరగాల్సిన నష్టం జరిగిపోతూనే ఉంది. యూడీఎస్‌ను ప్రక్షాళన చేయకుండా పైపై చర్యలతో ఎంతచేసినా నగరం పరిశుభ్రంగా మారేపరిస్థితి కనిపించడం లేదన్న విమర్శలున్నాయి. వర్షాల సీజన్ మొదలుకావడంతో ప్రజారోగ్యం పెను ప్రమాదంలో పడే అవకాశం లేకపోలేదు. ఇప్పటికే అతిసార ప్రబలుతోంది. డెంగ్యూ, మలేరియా చాపకిందనీరులా వ్యాపిస్తోంది. నిమ్మకాయల వీధి, తిలక్‌రోడ్డు, రేణిగుంట రోడ్డులోని ఆటోనగర్ వద్ద చిన్నపాటి వర్షానికే డ్రైనేజీ పొంగి రోడ్లపై ప్రవహిస్తోంది. దుర్గంధం వెదజల్లుతుండటంతోపాటు దోమలు పెరిగిపోతున్నాయని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కార్పొరేషన్ ఎన్నికలకు సమాయత్తంకండి : ఆరణి




ఆరణిని సన్మానిస్తున్న నాయకులు - సమావేశంలో ప్రసంగిస్తున్న సుగుణమ్మ

తిరుపతి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఏడాదిన్నరలో జరగనున్న కార్పొరేషన్ ఎన్నికలకు సమాయత్తం కావాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం చెన్నారెడ్డి కాలనీలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పుష్పావతి ఆధ్వర్యంలో జరిగిన కృతజ్ఞతా సమావేశంలో ఆయన ప్రసంగించారు. అఖండ మెజారిటీతో ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యేగా గెలవడంలో కూటమి నేతల కష్టం, ప్రజల అభిమానం జీవితాంతం గుర్తుపెట్టుకుంటానని చెప్పారు. ఎన్నికల్లో కష్టపడిన పని చేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. జనసేన, టీడీపీ, బీజేపీల మైత్రి పదేళ్లు ఉండాలని పవన్ కళ్యాణ్, చంద్రబాబు ఆకాంక్ష అని.. దీనికి అనుగుణంగా నియోజకవర్గంలో నడుచుకోవాలని సూచించారు. టీడీపీ మూడో క్లస్టర్ పులుగోరు మురళీకృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో 10, 11, 26, 27, 32 డివిజన్లకు సంబంధించి కృతజ్ఞతా సమావేశం జరిగింది. అలాగే టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి బీజీ కృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో 1, 16, 17, 50 డివిజన్ల సమావేశం జరిగింది. శుక్రవారం రాత్రి భవానీనగర్‌లో క్లస్టర్ ఇన్‌చార్జి మునిశేఖర్ రాయల్ ఆధ్వర్యంలోనూ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, కూటమి నాయకులు కోడూరు బాలసుబ్రమణ్యం, చిన బాబు, మహేష్ యాదవ్, ఈతమాకుల హేమంత్ యాదవ్, దొడ్డారెడ్డి రామకృష్ణారెడ్డి, దొడ్డారెడ్డి శ్రీనివాసులు రెడ్డి, మహబూబ్ బాషా, సుబ్బుయాదవ్, సామంచి శ్రీనివాస్, పొనగంటి భాస్కర్, వరప్రసాద్, భువనకుమార్ రెడ్డి, రాజారెడ్డి, మధుసూదన్, ఆనంద్, మురళి తదితరులు పాల్గొన్నారు.

మద్యం అక్రమ రవాణాను అరికట్టండి



ఎక్సైజ్, సెబ్ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

తిరుపతి (కలెక్టరేట్), జూలై 9: మద్యం అక్రమ నిల్వలు, సారా విక్రయాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎక్సైజ్, సెబ్ అధికారులతో మద్యం అమ్మకాలపై సమీక్షించారు. ఎక్సైజ్ ఈఎస్ జానకీరామ్, జిల్లా ఎస్ఈబీ అధికారి రాజేంద్ర, డీఎం నాగమల్లీశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల భద్రత ప్రమాణాలపై పర్యవేక్షణ ఉండాలి

జిల్లాలోని పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకుని నిరంతరం తనిఖీలు నిర్వహించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం పరిశ్రమల భద్రతా చర్యలపై సమీక్షించారు. డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణారెడ్డి కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ప్రతాప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం



తిరుపతి (జీవకోన), జూలై 9: తిరుపతి రోటరీక్లబ్ 66వ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం మంగళవారం నగరంలోని రోటరీక్లబ్ ఆఫ్ తిరుపతి చారిటబుల్ ట్రస్టు భవన నిర్మాణానికి దాతల నుంచి స్వీకరించిన స్థలంలో వైభవోపేతంగా జరిగింది. గుంటి రాజేష్‌కుమార్, మునస్వామిశెట్టి తదితరులు బాధ్యతలు స్వీకరించారు. బీఆర్ శ్రీధర్, వేమూరి జయరామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేస్తే చర్యలు

తిరుపతి(నేరవిభాగం), జూలై 9: బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేసినా, అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు ఎస్పీ విమలకుమారి హెచ్చరించారు. ఎస్వీయూ సెనెట్ హాలులో మంగళవారం జాతీయ బాలికల సంక్షేమ అధికారి పద్మావతి, జిల్లా విద్యాశాఖాధికారి ఆధ్వర్యంలో ధూమపాన నిషేధ కార్యక్రమం నిర్వహించారు.డీఎస్పీలు, సీఐలుపాల్గొన్నారు.

ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయండి

తిరుపతి(విద్య), జూలై 9: ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని గిరిజన నవ సమాజ్ (జీఎన్ఎస్) అధ్యక్షుడు శివశంకర్‌నాయక్ కోరారు. ఎస్వీ జూనియర్ కళాశాలలో మంగళవారం ఆర్ఐవో ప్రభాకర్‌రెడ్డిని కలిసి ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు.

ట్రాఫిక్ కష్టాలకు చెక్



పాత మున్సిపల్ సర్కిల్ వద్ద డివైడర్లు తొలగించాక - వీవీ మహల్ వైపున డివైడర్లు ఏర్పాటు

తిరుపతి(నేరవిభాగం), జూలై 9: నగరంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. ఎస్పీ హర్షవర్ధనరాజు ఇటీవల ప్రధాన ప్రాంతాలను తనిఖీ చేసి, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మంగళవారం తిరుపతి స్మార్ట్ సిటీ ఇన్‌చార్జి బాలాజీ పటేల్, ట్రాఫిక్ డీఎస్పీ రమణకుమార్ ఆధ్వర్యంలో పాత మున్సిపల్ కార్యాలయం వద్ద రాజీవ్‌గాంధీ సర్కిల్‌లో రోజూ వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నట్లు గుర్తించారు. ఇక్కడ నెల కిందట ట్రాఫిక్ పోలీసులు యూటర్న్ మూసివేయడమే దీనికి కారణంగా తేలింది. దీనిపై స్థానికుల నుంచి విమర్శలూ వచ్చాయి. ఈ నేపథ్యంలో యూటర్న్ వద్ద ఉన్న డివైడర్‌ను తొలగించారు. వీవీ మహల్ వైపు వెళ్లే వాహనాలకు ఇబ్బంది లేకుండా సిమెంటు డివైడర్లను ఏర్పాటు చేశారు. అలాగే దేవేందర్ థియేటర్ వైపు వెళ్లే వాహనాలకు ఇబ్బందులు లేకుండా మున్సిపల్ సర్కిల్‌లో ఎడమవైపు ఉన్న ఆక్రమణలను తొలగించారు.

గత ప్రభుత్వ నిర్ణయాలను సరిదిద్దాలి: ఆపస్

తిరుపతి(విద్య), జూలై 9: గత ప్రభుత్వం విద్యారంగంలో తీసుకున్న నిర్ణయాలను సమీక్షించి.. సరిదిద్దాలని కూటమి ప్రభుత్వానికి ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజి, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. వైసీపీ ప్రభుత్వ నిర్ణయాలవల్ల విద్యారంగం కుదేలైందని, ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రి లోకేశ్ వీటిపై ప్రత్యేక దృష్టిపెట్టి పరిష్కరించాలని కోరారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు 117 జీవోను రద్దు చేయాలని, తరగతుల విలీనాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి పాఠశాలకు ప్రధానోపాధ్యాయులను, పీడీ పోస్టులను కేటాయించాలని, హైస్కూల్ ప్లస్‌లలో రెగ్యులర్ ప్రాతిపదికన లెక్చరర్లను నియమించాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యార్థి దశ నుంచే బాధ్యతగా ఉండాలి : ఏఎస్పీ



విద్యార్థులతో ఏఎస్పీ కులశేఖర్, విద్యాభవన్ అధికారులు

తిరుపతి(విద్య), జూలై 9: విద్యార్థి దశ నుంచే సమాజం పట్ల బాధ్యతగా ఉండాలని జిల్లా శాంతి భద్రతల విభాగం ఏఎస్పీ కులశేఖర్ సూచించారు. భారతీయ విద్యాభవన్ విద్యార్థి నాయకత్వ బృంద ప్రమాణ స్వీకార కార్యక్రమం భవన్ తిరుపతి కేంద్ర గౌరవ సంచాలకుడు డాక్టర్ ఎన్ సత్యనారాయణరాజు అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఏఎస్పీ అతిథిగా హాజరయ్యారు. భవన్ ఎగ్జిక్యూటివ్, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, టీచర్లు పాల్గొన్నారు.

కూటమి నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), జూలై 9: కూటమి నేతలను ప్రసన్నం చేసుకుని కీలక స్థానాల్లో పోస్టింగ్‌లు దక్కించుకునే పనిలో పోలీసులున్నారు. స్థానిక ఎమ్మెల్యేల వద్దకు ఎవరి ద్వారా వెళితే పనవుతుందో అన్న దారులు వెతుకుతున్నారు. తిరుపతి ఈస్ట్ డీఎస్పీగా రావడం కోసం పోటీ ఎక్కువగా ఉంది. గతంలో ఇక్కడే పనిచేసి.. బదిలీ వేటుకు గురైన అధికారి స్థానిక పెద్దతలకాయ ద్వారా విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల డీఎస్పీగా పదోన్నతి పొంది ఇతర జిల్లాలో పనిచేస్తున్న మరో అధికారి సైతం పిల్లల చదువుల పేరుతో తిరుపతికి రావడానికి రాష్ట్ర రాజధాని స్థాయిలో పైరవీలు మొదలుపెట్టారు. ప్రస్తుతం డీఎస్పీగా పనిచేస్తున్న మరో అధికారి మళ్లీ తిరుపతికి పోస్టింగ్ ఇప్పిస్తే.. 'మీరు చెప్పినట్లు చేస్తా' అని అంటున్నారట. సర్కిల్ స్థాయికొస్తే గతంలో ఇక్కడ పనిచేసి లూప్‌లైన్‌లో ఉన్న ఒకరు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయనకు కూటమి నేతల అనుగ్రహం పుష్కలంగా ఉందట. తిరుపతి వెస్ట్ సీఐగా రావడానికి ఎంఆర్‌పల్లెలో పనిచేస్తున్న ఓ అధికారి తన వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. అలిపిరిలో సీఐగా పనిచేసి సస్పెండ్‌కు గురైన మరో అధికారి అదే స్థానానికి రావడానికి కీలక నేతలతో టచ్‌లో ఉన్నారట. ఎంఆర్‌పల్లె సీఐగా గతంలో తిరుపతిలో పనిచేసి బదిలీ అయి ప్రస్తుతం ఏసీబీలో ఉన్న ఒక అధికారి ఇక్కడకు రావడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం తిరుపతిలోని క్రైంస్టేషన్‌లో పనిచేస్తున్న ఓ అధికారి తిరుమలలో ఏదైనా ఒక స్టేషన్‌కు సీఐగా రావడానికి కీలక నేత ద్వారా ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా, తిరుమలకు ఉన్న ప్రాశస్త్యం దృష్ట్యా ఇక్కడకు రావడానికి దాదాపు 10 మంది అధికారులు పోటీ పడుతున్నట్లు తెలిసింది. తిరుమల డీఎస్పీగా గతంలో చిత్తూరు ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల సీఐగా పనిచేసి పదోన్నతి రాగానే పొరుగు జిల్లాలో పనిచేస్తున్న మరో అధికారి ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

మహిళల భద్రత కోసం ప్రత్యేక చట్టాలు అమలు చేయాలి

తిరుపతి(ఆటోనగర్), జూలై 9: మహిళల భద్రత కోసం ప్రత్యేక చట్టాలు అమలు చేయాలని జాతీయ మహిళా పార్టీ అధ్యక్షురాలు పి.రాజేశ్వరి ప్రభాకర్ పాలక ప్రభుత్వాలను కోరారు. ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నా, వారికి అవసరమైన రక్షణ కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు.కార్యదర్శి ఆర్.అనసూయ, నాయకులు వరలక్ష్మి, విజయలక్ష్మి, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

5నుంచి పినాకిని, జన శతాబ్ది రైళ్ల రద్దు

తిరుపతి, జూలై 9: విజయవాడ యార్డ్ పరిధిలో మరమ్మతుల కారణంగా పినాకిని, జనశతాబ్ది రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

- నెం.12711 విజయవాడ- చెన్నై సెంట్రల్, నెం.12712 చెన్నై సెంట్రల్-విజయవాడ పినాకినీ ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 5 నుంచి 10వ తేది వరకు పూర్తిగా రద్దు.
- నెం.12077 డాక్టర్ ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ - విజయవాడ, నెం.12078 విజయవాడ - డాక్టర్ ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ జనశతాబ్ది ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 5 నుంచి 10వ తేది వరకు పూర్తిగా రద్దు.
- నెం.17237 బిట్రగుంట- చెన్నై సెంట్రల్, నెం.17238 చెన్నై సెంట్రల్ - బిట్రగుంట ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 4 నుంచి 11వ తేది వరకు పూర్తిగా రద్దు.

దారి మళ్లింపు...

- నెం.12760 హైదరాబాద్ నుంచి సాయంత్రం 6 గంటలకు తాంబరం వెళ్లే ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 2 నుంచి 10వ తేది వరకు వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, విజయవాడకు బదులుగా పగిడిపల్లి, గుంటూరు, తెనాలి మీదుగా మళ్లింపు. ఈ రైలుకు నల్గొండ, గుంటూరులో అదనపు హాల్ట్.
- నెం.12759 తాంబరం నుంచి సాయంత్రం 5.30 గంటలకు హైదరాబాద్ వెళ్లే రైలు ఆగస్టు 2 నుంచి 10వ తేది వరకు విజయవాడ, ఖమ్మం, డోర్నకల్, మహబూబాబాద్, వరంగల్, ఖాజీపేటకు బదులుగా తెనాలి, గుంటూరు, పడిగిపల్లి మీదుగా మళ్లింపు. ఈ రైలుకు గుంటూరు, నల్గొండలో అదనపు హాల్ట్.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోండి


మాట్లాడుతున్న హెచ్‌ఆర్ నాగరాజు

గూడూరు, జూలై 9: ఇంజనీరింగ్ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అంది పుచ్చుకుంటే ఉద్యోగావకాశాలు పొందవచ్చని డెల్ఫీ టీవీఎస్ టెక్నాలజీస్ హెచ్‌ఆర్ నాగరాజు అన్నారు. మంగళవారం ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో డెల్ఫీ టీవీఎస్ టెక్నాలజీస్ సంస్థ ఆధ్వర్యంలో క్యాంపస్ ఎంపికలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు మేధాశక్తిని పెంపొందించుకోవాలన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ ఎంపికల్లో 270 మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాజామురగదాస్, డాక్టర్ వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



గూడూరు అర్బన్, జూలై 9: స్థానిక ఏరియా ఆసుపత్రిలో మంగళవారం జన విజ్ఞా వేదిక ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ షరీనా మాట్లాడుతూ... ప్రతినెలా జేవీవీ ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వి.రాజేంద్రప్రసాద్, నాగరాజు, చెంచునారాయణ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపితే చర్యలు

చిల్లకూరు, జూలై 9: ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎంపీఐ సునీల్ అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హెల్మెట్ ధరించి వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాలు జరిగినపుడు ప్రాణాలను కాపాడు కోవచ్చన్నారు.

నియోజకవర్గ సమస్యలను పరిష్కరించండి

కలెక్టర్‌కు ఎమ్మెల్యే పాశం విన్నపం


కలెక్టర్ వెంకటేశ్వర్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్



గూడూరు, జూలై 9: గూడూరు నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాలని మంగళవారం తిరుపతిలో కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మిచౌంగ్ తుఫాన్ కారణంగా నియోజకవర్గ పరిధిలోని వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం వద్ద కాజ్‌వే దెబ్బతినడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తాత్కాలిక మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తిరుమూరు వద్ద 30 మీటర్ల మేర తెగిన రోడ్డు, పొలాల్లో పేరుకుపోయిన ఇసుక మేటల తొలగింపు సహా తాగునీటి సమస్యను ఎరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో చాన్‌బాషా, బి.చెంచురామయ్య, శ్రీపతిబాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేరుస్తాం: కురుగొండ్ల


మీడియాతో మాట్లాడుతున్న కురుగొండ్ల

వెంకటగిరి, జూలై 9: ప్రతిఒక్కరూ సొంత ఇంటి కలను నెరవేర్చుకునేలా ఇసుక ఉచిత పంపిణీని సీఎం చంద్రబాబు ప్రజలకు చేరువ చేశారని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని మొగళ్లగుంట వద్ద ఉన్న ఇసుక స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో పేదరికాన్ని నిర్మూలించడమే సీఎం లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. ప్రస్తుతం స్టాక్ పాయింట్‌లో ఉన్న ఇసుక పంపిణీ పూర్తయిన తరువాత తదుపరి ప్రభుత్వ నిబంధనల మేరకు సరఫరా కార్యక్రమాన్ని అధికారులు నిర్ణయిస్తారన్నారు. ఈ సందర్భంగా స్టాక్ పాయింట్ ఎక్స్‌కవేటర్‌కు పూజలు నిర్వహించి ఇసుక ఎత్తే కార్యక్రమాన్ని ప్రారంభించారు. జనసేన పార్టీ నాయకుడు తోట కృష్ణయ్య, టీడీపీ నాయకులు బి.రాజేశ్వరరావు, పి.చంద్రమౌళిరెడ్డి, కేవీకే ప్రసాద్‌నాయుడు, కె.శ్రీనివాసులునాయుడు, పి.కోటేశ్వరరెడ్డి, చెంగారావు, ఎం.బాబు, తహసీల్దారు సాంబశివరావు, ఎంపీడీవో నీలకంఠేశ్వరరెడ్డి, సీఐ సంగమేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్‌నజీర్ తదితరులు ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ప్రముఖులు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాలందిస్తున్న విజయశ్రీ, వేనాటి సతీష్ రెడ్డి తదితరులు

సూళ్లూరుపేట/నాయుడుపేట, జూలై 9: జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌ను ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం మంగళవారం జిల్లా కలెక్టరేట్ ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. కొత్తగా వచ్చిన కలెక్టర్‌ను ఎమ్మెల్యే ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నెలవల రాజేష్, ఆకుతోట రమేష్, 786 రఫీ, వేమసాని శ్రీనివాసుల నాయుడు, సంచి కృష్ణయ్య, విజయకుమార్ నాయుడు ఉన్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్‌ను నాయుడుపేట టీడీపీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుపతి కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్‌కు టీడీపీ సీనియర్ నేత వేనాటి సతీష్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందజేశారు. కె.కృష్ణారెడ్డి, అశోక్‌రెడ్డి, పెరుమాల్ తదితరులు ఉన్నారు.

మండల పరిషత్ నిధులు పక్కదారి?

లక్షల విలువైన ఎంబుక్‌లు గల్లంతు ● కానరాని క్యాష్ బుక్...


కోట మండల పరిషత్ కార్యాలయం

కోట, జూలై 9 : కోట మండల పరిషత్‌లో నిధులు పక్కదారి పట్టాయని ఒక పక్క అధికార పార్టీ ఎంపీటీసీ సభ్యులు, మరో పక్క మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. మండల పరిషత్‌లో పనులకు సంబంధించి సర్వసభ్య సమావేశంలో తీర్మానం లేకుండానే పనులు జరిగినట్లు ఆరోపణలు వినబడుతున్నాయి. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 2023 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2024 మార్చి వరకు ఆర్థిక లావాదేవీలపై ఉండాల్సిన క్యాష్ బుక్ గల్లంతైనట్లు తెలిసింది. ఆ సంవత్సర కాలంలో మండల పరిషత్‌లో పలు రకాల కొనుగోళ్లు, ఖర్చులు, తదితర అంశాల సంబంధించి కీలకంగా క్యాష్ బుక్‌లో నమోదు చేసి ఉంటారు. ఆ బుక్ ఎంపీపీ పర్యవేక్షణలో మండల పరిషత్‌లో ఉంటుంది. ఈ బుక్‌లో లావాదేవీలను మండల పరిషత్ సూపరింటెండెంట్ నమోదు చేస్తుంటారు. అయితే ఏడాదిన్నరగా మండల పరిషత్ సూపరింటెండెంట్ నెల్లూరు జిల్లా పరిషత్‌కు డిప్యుటేషన్‌పై వెళ్లారు. అయితే ఆ క్యాష్ బుక్ ఏమైందోనన్న విషయంపై మండలంలో సర్వత్ర చర్చ జరుగుతోంది. అదేవిధంగా మండల పరిషత్ కార్యాలయానికి సంబంధించి ప్రతి పైసా కొనుగోలుకు ఓచర్లు ఉండాలి. అయితే ఇప్పటి వరకు ఎలాంటి ఓచర్లు లేవు. అదే విధంగా 2023 ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.50లక్షలకు పైగా పనులు జరిగాయి. ఆయా పనులకు సంబంధించి జనరల్ ఫండ్ నిధులు కూడా గుత్తేదారులకు ఇచ్చారు. అయితే పనులు జరిగిన తరువాత ఎంబుక్‌లను (మెజర్‌మెంట్ బుక్) ఆధారంగా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. అయితే లక్షలాది రూపాయలకు సంబంధించిన ఆ ఎంబుక్‌లు బిల్లులు చెల్లింపులు అయినప్పటికీ మండల పరిషత్ కార్యాలయంలో గల్లంతైనట్లు తెలిసింది. ఆయా ఎంబుక్‌లను ఈ నెల 12వ తేదీ లోపు తమకు ఇవ్వకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని ఎంపీడీవో శంకరయ్య హెచ్చరికలు జారీ చేసి ఉన్నారు. ఇదిలాఉండగా 2023 ఆర్థిక సంవత్సరంలో మండలంలోని 21 పంచాయతీలకు గాను కొన్ని పంచాయతీల్లో జరిగిన పనులకు సంబంధించి నిబంధనలకు విరుద్ధంగా జనరల్ ఫండ్‌ను చెల్లించినట్లు తెలిసింది. అంతేకాకుండా ప్రస్తుతం జరుగుతున్న లక్షలాది రూపాయల పనులకు సర్వసభ్య సమావేశం అనుమతులు లేకుండానే జరగడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆయా పనులకు బిల్లులు ఎలా చెల్లిస్తారని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

నిగ్గు తేల్చండి: ఎంపీటీసీ సభ్యులు

మండల పరిషత్‌లో జనరల్ ఫండ్, 15వ ఆర్థిక సంఘం నిధులు పక్కదారి పట్టాయన్న ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో తక్షణం ఆ నిధులకు సంబంధించి నిగ్గు తేల్చాలని కోట పట్టణానికి చెందిన టీడీపీ ఎంపీటీసీ సభ్యులు షేక్ షంషుద్దీన్, దారా సురేష్ డిమాండ్ చేస్తున్నారు. అనుమతులు లేకుండా పనులు చేయడం, కొన్ని నిధులు అక్రమమార్గంలో దారి మళ్లడంపై తక్షణం విచారణ జరపాలని ఈవోపీఆర్‌డీ వినతిపత్రం అందజేసి ఉన్నారు.

ఎంబుక్‌లు గల్లంతు వాస్తవమే...

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 152 పనులకు సంబంధించిన ఎంబుక్‌లు గల్లంతు వాస్తవమే. మూడు రోజుల్లో ఆ బుక్‌లు చేరకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తా. కొన్ని పనులు మండల పరిషత్ ఆమోదం లేకుండానే జరిగాయి. దీనిపై కూడా నివేదికలు తయారు చేస్తున్నా. కలెక్టర్‌కు పంపుతా.

- ఎం శంకరయ్య, ఎంపీడీవో

క్వార్ట్జ్, సిలికా భోక్తలపై వేటు!?

ఇప్పటికే నివేదిక అందజేత ● సీఎం ఆదేశాలతో వైసీపీ నేతల్లో వణుకు ● వందలాది కేసులు నమోదయ్యే అవకాశం

నెల్లూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల పాపం పండుతోంది. అధికారమే అండగా సహజ వనరులను అడ్డంగా దోచుకుతిన్న వైసీపీ వర్గాలపై వేటుకు రంగం సిద్ధమైంది. ఉమ్మడి నెల్లూరు జిల్లా కేంద్రంగా గత ఐదేళ్లలో సాగిన సిలికా, క్వార్ట్జ్ దోపిడీపై సీఎం చంద్రబాబు దృష్టి సారించారు. బాధ్యులపై చర్యలకు ఆదేశించారు. దీంతో జిల్లాకు చెందిన పలువురు వైసీపీ నేతల్లో వణుకు మొదలైంది. అగ్రనాయకుల కోసం ఇష్టారాజ్యంగా సిలికా, క్వార్ట్జ్, క్వారీలపై పడి దోపిడీ చేసిన వందలాది మంది వైసీపీ ద్వితీయశ్రేణి నాయకులు చట్టపరమైన చర్యలకు సిద్ధపడాల్సిన సమయం ఆసన్నమైంది. పలువురు వైసీపీ అగ్రనాయకులు సైతం ఈ కేసుల్లో బాధ్యులుగా చట్టం ముందు నిలబడాల్సి వస్తున్నది. సీఎం చంద్రబాబు త్వరలో గనుల శాఖలో జరిగిన దోపిడీపై విడుదల చేయబోయే శ్వేతపత్రంతో అక్రమార్కుల అరెస్టుపర్వం ప్రారంభంకానుంది. జిల్లా అధికారులు ఇప్పటికే ఇచ్చిన నివేదిక ప్రకారం చిన్నాపెద్దా అంతా కలిపి సుమారు 200 మంది వైసీపీ నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు అధికార వర్గాల సమాచారం.

● అక్రమ రవాణాలో అగ్రనేతల పేర్లు ?

చివరి ఏడాదిన్నరకాలం పాటు జిల్లాలో క్వార్ట్జ్ దోపిడీ నిరాటంకంగా సాగిన విషయం తెలిసిందే. ఈ దోపిడీపై జిల్లా అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి తాజాగా నివేదిక పంపారు. ఇందులో సుమారు 200 మందికి పైగా వైసీపీ నాయకుల ప్రమేయం ఉన్నట్లు పేర్కొన్నట్లు తెలిసింది. జిల్లాలో జరిగిన క్వార్ట్జ్ దోపిడీలో వైసీపీ ముఖ్య నాయకులు సజ్జల రామకృష్ణారెడ్డి, మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిలపై పెద్ద ఎత్తున ఆరోపణలు, అభియోగాలు వెల్లువెత్తాయి. సజ్జల సూచన మేరకు జిల్లాలో క్వార్ట్జ్ దోపిడీ మొదలైందని, అధిష్ఠానం అనుమతితో అనిల్‌కుమార్ దాన్ని గంపగుత్తగా కైవసం చేసుకున్నారని, సర్వేపల్లి నియోజకవర్గం పరిధిలో మాజీ మంత్రి కాకాణి ప్రభుత్వ భూముల్లోని క్వార్ట్జ్ నిక్షేపాలను కొల్లగొట్టారని అప్పట్లోనే పెద్ద ఎత్తున ఆరోపణలు వెల్లువెత్తాయి. నిజమైన లీజుదారులను సైతం క్వారీల్లోకి రానీయకుండా దౌర్జన్యంగా కైవసం చేసుకున్నారని, క్వార్ట్జ్ దోపిడీపై సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కేంద్రప్రభుత్వానికి ఫిర్యాదు చేయడంతో జిల్లా అధికారుల్లో కదలిక వచ్చింది. ఆ క్రమంలోనే విచారణ జరిపి లక్షల టన్నుల క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలు జరిగాయని అధికారులు నివేదిక పంపారు. ప్రస్తుతం ఆ నివేదిక సీఎం చంద్రబాబుకు దృష్టికి వెళ్లింది. అలాగే ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలో ఐదేళ్లపాటు సాగిన సిలికా దోపిడీపై కూడా సీఎం దృష్టి సారించారు. గూడూరు డివిజన్ పరిధిలో 4500 ఎకరాల్లో సిలికా రీచ్‌లు ఉన్నాయి. 80 మంది లీజుదారులు ఉన్నారు. వైసీపీ నాయకులు ఈ లీజుదారందరిని నట్టేట ముంచారు. అధికార బలంతో వీరందరి లీజులను బలవతంగా స్వాధీనం చేసుకున్నారు. అది చాలదన్నట్లు సుమారు 400 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఉన్న సిలికాను దోచుకున్నారు. ఐదేళ్ల పాటు అడ్డూఅదుపు లేకుండా అధికారమే అండగా సాగిన ఈ దోపిడీపై కూడా చంద్రబాబు దృష్టి సారించారు. గూడూరు డివిజన్‌కు చెందిన పలువురు వైసీపీ నాయకులు ఈ కేసులో బాధ్యులుగా గుర్తించబడ్డారు. సోమవారం సీఎం చంద్రబాబు గనుల శాఖపై నిర్వహించిన సమీక్షలో నెల్లూరు జిల్లా కేంద్రంగా జరిగిన క్వార్ట్జ్, సిలికా దోపిడీపై సమగ్ర నివేదికను సమర్పించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. దీంతో జిల్లాకు చెందిన పలువురు అక్రమార్కుల్లో వణుకు మొదలైంది. అగ్రనాయకుల ప్రాపకం కోసం దగ్గరుండి కొండలు, గుట్టలు కొల్లగొట్టిన పలువురు ద్వితీయ శ్రేణి నాయకులు అందుకు తగిన మూల్యం చెల్లించే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ కేసులో పలువురు వైసీపీ అగ్రనాయకులు సైతం చిక్కుల్లో పడే సూచనలు కనిపిస్తున్నాయి.

స్టాక్ పాయింట్ నుంచి ఇసుక సరఫరా ప్రారంభం


ఇసుక సరఫరాను జెండా ఊపి ప్రారంభిస్తు ఎమ్మెల్యే విజయశ్రీ

దొరవారిసత్రం, జూలై 9: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు దొరవారిసత్రం మండలం నేతాజీనగర్ వద్ద ఉన్న ఇసుక స్టాక్ పాయింట్ నుండి మంగళవారం ఇసుక విక్రయాలు ప్రారంభమయాయి. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పాయింట్ వద్ద సరఫరాను ప్రారంభించారు. తగ్గించిన ధరలతో ఇసుకను వినియోగదారులకు అందించేలా చర్యలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం కొత్త పాలసీతో ఈ పాయింట్ వద్ద ఇసుక టన్ను రూ.465 నిర్ణయించినట్లు తెలిపారు. తగ్గిన ధరలు లబ్ధిదారులకు ఎంతో ఉపయోగకరమన్నారు. త్వరలో కొత్త పాలసీ కూడా విడుదల చేయనున్నట్లు తెలిపారు. కాగా అధికారులు ఇసుకను కొనుగోలుదారుల నుంచి ఆన్‌లైన్ పేమెంట్ చేసుకొంటూ, వే బిల్లును మ్యాన్‌వల్‌గా ఇస్తున్నారు. ఒక ఆధార్ కార్డుపై రోజుకు 20 టన్నుల ఇసుక ఇస్తున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులునాయుడు, తెలుగు యువత అధ్యక్షుడు సంచి విజయ్ కుమార్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఉదయ్‌కుమార్, ఏజీ కిషోర్, ఆర్డీవో మునిచంద్ర, తహసీల్దారు గోపినాథరెడ్డి, గనుల శాఖ ఆర్‌ఐ మురళి, ఎస్‌ఐ తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాద తయారీని ఆధునికీకరించండి

సిబ్బందికి శిక్షణ ఇవ్వడంతో పాటు ఇన్‌హౌస్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయండి - టీటీడీకి పాకశాస్త్ర నిపుణుల సూచన


పాకశాస్త్ర నిపుణులతో సమావేశంలో టీటీడీ ఈవో,జేఈవో తదితరులు

తిరుమల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి భక్తులకు మరింత రుచికరమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించడానికి అన్నప్రసాద తయారీ విధానాన్ని ఆధునికీకరించాలని ప్రఖ్యాత పాకశాస్త్ర నిపుణులు టీటీడీకి సూచించారు. తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలో మంగళవారం సాయంత్రం టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, దక్షిణ భారతదేశ చెఫ్స్ అసోసియేషన్ బృందంతో కలిసి అన్నప్రసాదం, వంటశాలల ఆధునికీకరణ తదితర అంశాలపై టీటీడీ ఈవో శ్యామలరావు సుదీర్ఘంగా చర్చించారు. అంతకుముందు తిరుమలలోని వెంగమాంబ అన్నప్రసాద కేంద్రాన్ని సందర్శించిన చెఫ్స్ బృందం అన్నప్రసాదాలు వడ్డించడం, నిల్వ చేయడం, శుభ్రపరచడం తదితర కార్యకలాపాలను పరిశీలించింది.రోజురోజుకూ పెరుగుతున్న అసంఖ్యాక భక్తుల అవసరాలకు అనుగుణంగా వంటశాలను ఆధునికీకరించాలని సూచించింది.అన్నప్రసాద భవన సిబ్బందికి శిక్షణ ఇవ్వడం ద్వారా వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించడం, ఇన్‌హౌస్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసి తనిఖీ చేయడం, ఆహార పదార్థాల పరిశుభ్రత, వ్యర్థ పదార్థాల నిర్వహణ, పరికరాల యాంత్రీకరణ, ఆహారాన్ని రుచికరంగా, వేగవంతమైన పద్ధతిలో తయారు చేయడం, మూడు నెలలకోసారి ఫుడ్ అనలిస్ట్‌లతో సూచనలు తీసుకోవడం వంటి అనేక సూచనలు చేశారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లపై పక్కా ప్రణాళికను రూపొందించి మరోసారి అన్నప్రసాద కార్యకలాపాలపై ఆహారనిపుణులతో త్వరలో సమావేశం నిర్వహించనున్నట్టు ఈవో తెలిపారు. జీఆర్‌టీ గ్రూప్ ఆఫ్ హోటల్స్ సీఈవో విజయ్ విక్రమ్ కోటా, సౌతిండియా చెఫ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ దామోదరన్, చెఫ్ తిరులోక్‌చందర్,తిరుపతిలోని ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్ హెడ్ చెఫ్ సీతారామ్ ప్రసాద్, కిచెన్ కన్సల్టెంట్స్, డిజైనర్ రితేష్ చౌదరీ, దీపక్, నితీష్, టీటీడీ డిప్యూటీఈవో రాజేంద్ర, క్యాటరింగ్ ఆఫీసర్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ కేసులో ముగ్గురికి ఐదున్నరేళ్ల జైలుశిక్ష

తిరుపతి(నేరవిభాగం), జూలై 9: దోపిడీ కేసులో ముగ్గురికి ఐదున్నరేళ్ల జైలు శిక్ష విధిస్తూ చిత్తూరు అదనపు సీనియర్ న్యాయమూర్తి వెన్నెల మంగళవారం తీర్పు చెప్పారు. అలిపిరి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడు రాష్ట్రం విల్లుపురం జిల్లా, తిరుక్కోవిలూరుకు చెందిన సంగం రాజా, తిరుప్పూర్ జిల్లా పుదూరుకు చెందిన దొరైస్వామి, చెన్నై మెరీనా బీచ్‌కు చెందిన యాచకుడు ఖాజా మొహిద్దీన్ షాజహాన్ గత ఏడాది అక్టోబరు 11న అలిపిరి లింక్ బస్టాండులో మొబైల్ యాక్సెసరీస్ అమ్ముకుంటున్న మంగళంకు చెందిన పి.అనీష్ వద్దకు వచ్చారు. అనీష్‌ను బెదిరించి అతడి వద్ద ఉన్న డబ్బు, మొబైల్ యాక్సెసరీస్ ఇవ్వాలని బెదిరించారు. అతను ఇవ్వక పోవడంతో తమ వద్ద ఉన్న ఇనుప రాడ్లు, కత్తులు, బ్లేడ్లతో దాడిచేసి.. రూ.13వేలతో పాటు రూ.4వేల విలువైన మొబైల్ యాక్సెసరీస్ తీసుకుని పరారయ్యారు.ఈదాడిలో అనీష్‌కి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదుతో అప్పటి అలిపిరి సీఐ అబ్బన్న కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితులను అక్టోబరు 14న అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నేరం నిరూపణ కావడంతో ఒక్కొక్కరికి ఐదున్నరేళ్ల జైలు శిక్ష, రూ.3000 జరిమానా విధిస్తూ మంగళవారం న్యాయమూర్తి తీర్పు చెప్పారు. కేసును ఛేదించిన అప్పటి అలిపిరి సీఐ అబ్బన్న, ఎస్‌ఐ జయచంద్ర, ఏపీపీ శైలజ, కానిస్టేబుళ్లు ప్రభాకర్, నాగరాజులను ఎస్పీ హర్షవర్ధన రాజు అభినందించారు.

అభివృద్ధి, సంక్షేమమే సీఎం చంద్రబాబు లక్ష్యం


నెలవల సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్యే విజయశ్రీని సన్మానిస్తున్న నాయకులు

పెళ్లకూరు, జూలై 9: ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం ధ్వంసమైందని, ఏపీని తిరిగి అభివృద్ధి చేయడంతో పాటు రాష్ట్ర ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు పని చేస్తున్నారని సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. మంగళవారం పెళ్లకూరులో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో పార్టీ జెండా మోసిన కార్యకర్తలు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. నామినేటెడ్ పదువుల్లో మొదటి ప్రాధాన్యమి స్తామన్నారు. ఎమ్మెల్యే విజయశ్రీ మాట్లాడుతూ... తన గెలుపునకు కృషి చేసిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఎస్.విజయ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ... నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా నెలవల సుబ్రహ్మణ్యం బాధ్యతలు తీసుకున్న తరువాత నాయకులను సమన్వయం చేసుకుని 22 వేల ఓట్లకు పైగా మెజార్టీతో విజయశ్రీని గెలి పించుకున్నామన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల సుబ్రహ్మణ్యం, ఎస్.విజయభాస్కర్‌రెడ్డితో కలసి చిల్లకూరుకు చేరుకున్న వారికి నాయకులు, కార్యకర్తలు గజమాలతో స్వాగతం పలికారు. అక్కడి నుంచి పెళ్లకూరు చేరుకున్నారు. డి.ప్రసాద్‌నాయుడు, హరినాయుడు, గోపాల్‌రెడ్డి, ఎన్.ప్రసాద్‌నాయుడు, సిద్దులయ్యనాయుడు, రామచంద్రారెడ్డి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

12న మండల సర్వసభ్య సమావేశం

తడ, జూలై 9: ఈ నెల 12వ తేదీ శుక్రవారం 12వ మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీవో విజయ్‌కుమార్ తెలిపారు. ఎంపీపీ కొలవి రఘురెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ముఖ్య అతిథిగా హాజరవుతారని ఆయన చెప్పారు. ఆ సమావేశంలో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, ఉపాధి హామీ పనులు తదితరాలపై సమీక్ష జరుగుతుందని తెలిపారు. మండల స్థాయి అధికారులందరూ హాజరవుతారని తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కోఆప్షన్‌మెంబర్లు సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.

నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకోండి


ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

డక్కిలి, జూలై 9: మండలంలోని వెలుగు కార్యాలయ పరిధిలో గ్రామ సంఘాల్లో సంఘ సభ్యులకు తెలియకుండా నిధులు స్వాహ చేసిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ జి.మునెయ్య డిమాండ్ చేశారు. దీనిపై మంగళవారం ఆయన ఎంపీడీవో లీలామాధురి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్ఐ చౌడయ్యకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సంఘాల్లో పొదుపు మహిళలకు సంబంధించి బ్యాంకు లింకేజీలు ద్వారా జమ అయిన నిధులు పెద్ద ఎత్తున దుర్వినియోగమైనట్టు గతంలో తాను డీఆర్‌డీఏ పీడీకి ఫిర్యాదు చేయగా కమిటీని నియమించి విచారణ జరిపించారని చెప్పారు. సంఘాల్లో పెద్ద ఎత్తున నిధులు దుర్వినియోగమైనట్టు ఆ కమిటీ గుర్తించి వెలుగు సిబ్బందికి నోటీసులు జారీ చేసిందే తప్ప వారిపై చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా వారిపై చర్యలు తీసుకోకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

తాగునీటి సమస్య తీర్చాలంటూ నిరసన


బిందెలతో నిరసన తెలియజేస్తున్న బీడీకాలనీ మహిళలు

నాయుడుపేట టౌన్, జూలై 9: తాగునీటి సమస్య తీర్చాలంటూ బీడీకాలనీ మహిళలు బిందెలతో నిరసన తెలిపారు. ఆరు నెలలుగా కాలనీలో తాగునీరు సరఫరా కావడం లేదని అరకొరగా ట్యాంకర్ ద్వారా పంపిణీ చేస్తున్నారన్నారు. అయితే ఆ నీరు కూడా బురదగా ఉండటంతో అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ట్యాంకర్ ద్వారా ఇంటికి ఒక్క బిందె మాత్రమే వస్తున్నాయని దీంతో అవస్థలు పడుతున్నారన్నారు. తక్షణమే మున్సిపల్ అధికారులు తాగునీరు కాలనీకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సాయంత్రం బిందెలతో నాయుడుపేట - వెంకటగిరి రహదారికి అడ్డంగా నిరసన తెలియజేశారు. సమాచారం అందుకున్న పోలీసులు మహిళలకు నచ్చచెప్పి ఆందోళనను విరమింపజేశారు. అనంతరం ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి

● ఎమ్మెల్యే విజయశ్రీ ఆదేశం



మొక్క నాటుతున్న విజయశ్రీ

పెళ్లకూరు, జూలై 9: మండలాన్ని అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే విజయశ్రీ కోరారు. మంగళవారం పెళ్లకూరు ఎంపీడీవో సమావేశ మందిరంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ... శాఖాపరంగా చేపట్టాల్సిన పనులకు సంబంధించిన సమగ్ర ప్రణాళికలు సిద్ధంచేసి ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తే తాను నిధులు మంజూరు చేయిస్తానన్నారు. ఉచిత ఇసుక విధానాన్ని పటిష్ఠంగా అమలు చేయాలన్నారు. ఎట్టి పరిస్థితులోనూ అక్రమ రవాణా జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. మండలాభివృద్ధికి ఎమ్మెల్యేతో కలసి పని చేస్తామని ఎంపీపీ పోలంరెడ్డి, జడ్పీటీసీ ఎన్.ప్రిస్కిల్లా చెప్పారు. అంతకుముందు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఎస్.విజయ భాస్కర్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి వి.శేఖర్‌నాయుడు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వి.మురళీకృష్ణారెడ్డి, నాయకులు పి.రమేష్‌నాయుడు, మధునాయుడు, కె.శివకుమార్, నాగేంద్రప్రసాదరెడ్డి, చైతన్య కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవ ర్యాలీ

నాయుడుపేట టౌన్, జూలై 9: అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆవిర్భావ దినోత్సవ శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కన్వీనర్ సన్నీ మాట్లాడుతూ... 76 సంవత్సరాలుగా విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పోరాడిన సంఘం ఏబీవీపీ అని అన్నారు. విద్యార్థుల్లో దేశభక్తి భావాలు నింపుతామన్నారు. ఈ కార్యక్రమంలో టి.చెందు, హరి, నారాయణ, వినయ్, భరత్, ప్రణయ్, బాలాజీ తదితరులు ర్యాలీని పర్యవేక్షించారు.

27 ఎర్రచందనం దుంగల స్వాధీనం



తడ, జూలై 9: మండలంలోని భీమునివారి పాళెం చెక్‌పోస్టు వద్ద పోలీసులు 27 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా చెక్‌పోస్టు వద్ద మాటు వేసి ఉండడగా అటుగా వచ్చిన లగేజీ వ్యాన్‌ను తనిఖీ చేశారు. అందులో ఎర్రచందనం దుంగలు ఉన్నట్టు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఎక్కడినుంచి రవాణా చేస్తున్నారన్న విషయంపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

తాళం వేసిన ఇంట్లో భారీ చోరీ

320గ్రాముల బంగారం, 900 గ్రాముల వెండి ఆభరణాలు

రూ.3.50లక్షల అపహరణ



చిందరవందరగా ఉన్న బీరువా - వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీం

శ్రీకాళహస్తి, జూలై 9: శ్రీకాళహస్తి పట్టణం దక్షిణకైలాస్ నగర్ కాలనీలోని ఓ ఇంట్లో సోమవారం రాత్రి భారీ చోరీ జరిగింది. టూటౌన్ సీఐ రారాజు కథనం మేరకు... పట్టణానికి చెందిన సిరాజ్ ఉన్నీసా తన కుమారుడితో కలిసి దక్షిణకైలాస్ నగర్ కాలనీలో అద్దె ఇంట్లో నివసిస్తోంది. ఆమె కుమార్తె, అల్లుడు చెన్నైలో ఉద్యోగం చేస్తున్నారు. ఇటీవల కూతురు, అల్లుడు తమిళనాడులోని వేర్వేరు ప్రాంతాలకు బదిలీ అయ్యారు. దీంతో సిరాజ్ ఉన్నీసా బంగారు ఆభరణాలను శ్రీకాళహస్తిలోని తన తల్లి వద్ద భద్రపరిచింది. ఆదివారం సిరాజ్ ఉన్నీసా కొడుకుతో కలిసి చెన్నైలోని కుమార్తె ఇంటికి వెళ్లింది. సోమవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు తలుపులు పగులగొట్టి ఆమె ఇంట్లోకి ప్రవేశించారు. బీరువాలోని 40 సవర్లు(320) గ్రాములు బంగారు ఆభరణాలు, 900 గ్రాముల వెండి వస్తువులు, రూ.3.50లక్షల నగదు దోచుకెళ్లారు. మంగళవారం ఇంటి తలుపులు తెరచి ఉండటాన్ని పొరుగింటివారు గమనించి చెన్నైలో ఉన్న సిరాజ్ ఉన్నీసాకు సమాచారం అందించారు. ఆమె కొడుకుతో పాటు శ్రీకాళహస్తికి చేరుకుని ఇంటిని పరిశీలించారు. చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ రారాజు ఘటనా స్థలానికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. తిరుపతి నుంచి క్లూస్‌టీం బృందం వచ్చి వేలిముద్రల నమూనాలను సేకరించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు చోరీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మాజీ ఎమ్మెల్యే మధు అవినీతిపై

న్యాయ విచారణ జరిపించండి



సమావేశంలో మాట్లాడుతున్న హరికృష్ణ

శ్రీకాళహస్తి, జూలై 9: వైసీపీ పాలనలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కూడబెట్టిన అక్రమాస్తులు, సాగించిన అవినీతి అక్రమాలపై సమగ్ర న్యాయవిచారణ జరపాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి రాయపనేని హరికృష్ణ డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ తాను అధికారంలోకి వస్తే గత ప్రభుత్వంలో జరిగిన అవినీతిపై విచారణ జరిపి చర్యలు చేపడతానని ప్రస్తుత ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సూచించారు. పోలీసు, రెవెన్యూ, ముక్కంటి ఆలయం, ఇంకా పలు ప్రభుత్వ శాఖల అధికారులను దళారులుగా మలుచుకుని మాజీ ఎమ్మెల్యే సాగించిన అవినీతి దందాకు హద్దే లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగనన్న కాలనీల పేరిట వందల కోట్ల అవినీతి చోటు చేసుకుందని మాజీ ఎమ్మెల్యే, ఆయన బంధువులు, అనచరులు కలిసి రైతుల పొట్టగొట్టారని ఆరోపించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో గత ఐదేళ్లలో భారీ ఎత్తున అవినీతి చోటు చేసుకుందని, ముఖ్యంగా వెండి నిల్వలు, కొనుగోళ్ల నాగపడగల విషయంలో మాజీ ఎమ్మెల్యే అక్రమాలకు పాల్పడ్డారని, నియోజకవర్గంలో ప్రైవేటు పరిశ్రమలతో కుమ్మక్కై రూ.కోట్లు ఆర్జించారన్నారు. ఎమ్మెల్యేగా దిగిపోతూ రాజీవ్‌నగర్‌లో 16 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని, ఆ భూమిని స్వాధీనం చేసుకోకుంటే తామే పేదల సమక్షంలో జెండాలు పాతి గుడిసెలు వేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం స్పందించి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, అతని అనుచరులపై న్యాయవిచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రామిశెట్టి వెంకయ్య, వెంకటరత్నం, మోహన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాలు

శ్రీకాళహస్తి, జూలై 9: కేంద్ర కార్మిక, ఉపాధిశాఖ కింద పనిచేసే బీడీ కార్మికుల కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని శ్రీకాళహస్తి బీడీ కార్మికుల వైద్యశాల డాక్టర్ పవన్‌కుమార్ తెలిపారు. 1నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులు ఆగస్టు 31 వరకు, ఇంటర్, డిగ్రీ, వృత్తి విద్యాకోర్సులు చదివే విద్యార్థులకు అక్టోబరు 31వరకు సంబంధిత వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు బీడీకార్మిక వైద్యశాలలో సంప్రదించాలని కోరారు.

బియ్యపు మధు అక్రమాలను బయటపెడతా

ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి



టీడీపీ శ్రేణులకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

రేణిగుంట, జూలై 9: శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అక్రమాలను బయటపెడతామని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి హెచ్చరించారు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం మొదటి సారిగా మంగళవారం సాయంత్రం శ్రీకాళహస్తికి వచ్చారు. రేణిగుంటలోని విమానాశ్రయం వద్ద భారీఎత్తున టీడీపీ శ్రేణులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వారం రోజుల్లో 600 నుంచి 700 ఎకరాల భూముల కబ్జాలకు మధుసూదన్‌రెడ్డి పాల్పడ్డారని, ఇందులో పోలీసులు, తహసీల్దార్లు, వీఆర్వోలు, వలంటీర్లకు భాగస్వామ్యం వుందని ఆరోపించారు. మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణుల పేర్ల మీద ఏపీఐఐసీ భూములు బదిలీ అయ్యాయని, వీటన్నింటిని బయటపెడతామని చెప్పారు. నియోజకవర్గంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టడంతో పాటు తన పాదయాత్రలో గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు.

శ్రీకాళహస్తి

సత్యవేడు

అడవి కొడియంబేడులో ఇసుక పంపిణీ ప్రారంభం

పిచ్చాటూరు, జూలై 9: మండలంలోని అడవి కొడియంబేడులో డంప్ చేసిన ఇసుకను మంగళవారం నుంచి లబ్ధిదారులకు పంపిణీ చేయడం ప్రారంభించారు. తహసీల్దార్ హుస్సేన్ సాహెబ్, ఎస్ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆన్‌లైన్ సమస్య వల్ల మూడు రోజుల పాటు స్థానికులకు మాత్రమే ఇసుక పంపిణీ చేస్తామని, ఆ తరువాత బయట వారికి కూడా కేటాయిస్తామని తెలిపారు.

పోలీసుల అదుపులో ఇద్దరు కిడ్నాపర్లు

శ్రీకాళహస్తి, జూలై 9: ఎస్ఆర్ఐను కిడ్నాప్ చేసిన కేసులో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. శ్రీకాళహస్తి పట్టణ శివారులోని రాజీవ్‌నగర్ వద్ద తిరుపతికి చెందిన ఎస్ఆర్ఐ హరికృష్ణను కొందరు కిడ్నాప్ చేసిన విషయం తెలిసిందే. సోమవారం రాత్రి ఆయన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తిరుపతికి చెందిన ఇద్దరు కిడ్నాపర్లను మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఇందులో పాత్రధారులైన మరికొందరి కోసం గాలింపు కొనసాగిస్తున్నారు.

నవోదయకు పండూరు విద్యార్థి ఎంపిక

ఏర్పేడు, జూలై 9: ఏర్పేడు మండలం పంగూరు ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న ముని రామకృష్ణ నవోదయ పాఠశాలకు ఎంపికయ్యాడు. మంగళవారం ఎంఈవోలు ప్రేమల, దయాకర్ విద్యార్థిని సన్మానించారు. నవోదయకు ఎంపికయ్యే విధంగా బోధన చేసి, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను అభినందించారు.

గుండేలిగుంటపై డయేరియా పంజా

- వాంతులు, విరేచనాలతో ఇద్దరి మృతి
- వేపచెట్టు మోడువారడంతో

కాలనీకి అరిష్టం జరిగిందని గిరిజనుల అపోహ

శ్రీకాళహస్తి, జూలై 9: తొట్టంబేడు మండలం గుండేలిగుంట గిరిజన కాలనీపై డయేరియా పంజా విసిరింది. అదే సమయంలో గ్రామస్తులు గంగమ్మగా ఆరాధించే వేపచెట్టు మోడువారడంతో అందరిలో ఏదో అరిష్టం జరిగిందన్న అపోహ ఆవరించింది. వాంతులు, విరేచనాలు వీడకపోవడంతో నెలరోజుల క్రితం ఒక వృద్ధుడు, మరో ఏడాదిన్నర బాలుడు మృత్యువాత పడ్డారు. తమ దేవత ఆగ్రహించిందన్న మూఢ విశ్వాసంతో గ్రామంలోని పలు కుటుంబాలు ఇళ్లు విడిచి వెళ్లిపోయాయి. ఈ ఘటనపై వాస్తవాలను నిర్ధారించేందుకు అధికారుల బృందం మంగళవారం క్షేత్రస్థాయి పర్యటనలో పలు అంశాలను గుర్తించారు. తొట్టంబేడు మండలం గుండేలిగుంట ఎస్టీకాలనీలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇళ్ల మధ్యన మురుగునీరు తిష్టవేసుకుంది. తాగునీటి చేతిబోరు వద్ద మురుగు పేరుకుపోయింది. అదే సమయంలో మండు వేసవిలో రెండు నెలల క్రితం గిరిజనులు భక్తిభావంతో ఆరాధించే గంగమ్మ వేపమాను ఎండిపోయింది. ఆ తరువాత కొద్దిరోజులకే గిరిజన కాలనీలో డయేరియా వ్యాప్తి చెందింది. ఈ క్రమంలో సుబ్రహ్మణ్యం(60) అనే వృద్ధుడు, ఏడాదిన్నర వయసున్న చరణ్ నెలరోజుల క్రితం మృతి చెందాడు. తమ దేవత ఆగ్రహించిన కారణంగానే గ్రామంలో అంటురోగం వెంటాడుతోందన్న ఆందోళనతో 13 కుటుంబాలు ఊరు విడిచి వెళ్లిపోయాయి. పాఠశాలలు తెరిచిన తరువాత విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో ఉపాధ్యాయులు ఆరాతీశారు. గుండేలిగుంట ఎస్టీ కాలనీలో కొన్ని కుటుంబాలు ఊరు విడిచివెళ్లిపోయినట్లు గుర్తించారు. ఇది సామాజిక మాధ్యమాల ద్వారా వెలుగులోకి రావడంతో మంగళవారం పత్రికల్లో ప్రచురితమైంది. తొట్టంబేడు తహసీల్దారు శివరాముడు, ఎంపీడీవో ప్రవీణ్ అధికారులతో కలిసి కాలనీలో పర్యటించారు. డ్రైనేజీ వ్యవస్థ లేకపోడం, చేతిబోరు వద్ద పారిశుధ్య లోపాన్ని గుర్తించారు. తాగునీటి బోరు మోటారు వద్ద పైపు పగలడంతో నీరు కలుషితం అవుతోందని ప్రాథమికంగా అంచనా వేశారు. తాగునీటి నమూనాలను ల్యాబ్‌కు తరలించారు. ఆరు నెలల క్రితం సిమెంట్ రోడ్డు నిర్మించిన కారణంగా వేపచెట్టు ఎండిపోయి ఉండవచ్చని గ్రామస్తులకు వివరించారు.



గుండేలిగుంటలో పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

వెళ్లినవారు వచ్చేస్తున్నారు

తమ గ్రామస్తులు ఉపాధి కోసం ఎక్కువ మంది మామిడి తోటలు, కోళ్ల ఫారాలు, చేపలగుంటలు, పుచ్చ, దోస వంటి తోటలకు కాపలాగా వెళుతుంటారు. నెల రోజుల క్రితం వాంతులు, విరేచనాల సమస్యతో 13 కుటుంబాల వారు భయాందోళనకు గురై వారు పనిచేసే ప్రాంతాలకు వెళ్లిపోయారు. వారం రోజుల నుంచి ఒక్కొక్కరుగా తిరిగి వచ్చేస్తున్నారు. భయం పోవడం కోసం అందరూ కలిసి గంగమ్మ జాతర జరుపుకున్నాం.

డయేరియా నిర్మూలనకు చర్యలు

గుండేలిగుంట సమస్యను అధ్యయనం చేశాం. 40 కుటుంబాల్లో మూడు ఇళ్లు ఊరు వదలి వెళ్లినట్లు గుర్తించి మూఢనమ్మకంపై అవగాహన కల్పించాం. వారికి అండగా నిలిచి అపోహలను తొలగిస్తాం. ఇక నీటి నమూనాలను ల్యాబ్‌కు పంపించాం. నివేదిక వచ్చిన వెంటనే దాని ఆధారంగా డయేరియా నిర్మూలనకు చర్యలు తీసుకుంటాం.

- తహసీల్దారు శివరాముడు

వైసీపీ భూబాధితులందరికీ న్యాయం చేస్తా: సుధీర్‌రెడ్డి



సుధీర్‌రెడ్డికి గజమాలతో స్వాగతం పలుకుతున్న టీడీపీ శ్రేణులు

శ్రీకాళహస్తి, జూలై 9: వైసీపీ పాలనలో భూములు కోల్పోయిన బాధితులందరికీ న్యాయం చేస్తానని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఎన్టీఆర్ భవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, ఆయన అనుచరులు ఐదేళ్ల పాలనలో ప్రజలను బెదిరించి భూములను దోచేశారని ఆరోపించారు. అలాంటి బాధితులంతా తనను నేరుగా సంప్రదిస్తే న్యాయయం చేస్తానని హామీ ఇచ్చారు. అరాచక శక్తులకు అండగా నిలిచిన అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన రామరాజ్యాన్ని తలపిస్తోందన్నారు. గడచిన నెలరోజుల్లోనే ఉచిత ఇసుక పాలసీని ప్రజలకు చేరువ చేయడం హర్షణీయమన్నారు. శ్రీకాళహస్తిలో త్వరలో రెండు అన్న క్యాంటీన్లను ప్రారంభించి పేదలకు కడుపునిండా భోజనం అందేలా చేస్తామన్నారు. అలాగే ప్రెస్‌క్లబ్‌కు స్థలం కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ఇంటిగ్రేటెడ్ వసతి గృహం అభివృద్ధి పనులను 25 రోజుల్లోనే పూర్తి చేస్తామని, అలాగే కాసాగార్డెన్ వసతి గృహాన్ని కజారియా పరిశ్రమ సాయంతో మోడల్ హాస్టల్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. అధ్వానంగా ఉన్న రోడ్లకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. ఇక ముక్కంటి ఆలయాన్ని దశలవారీగా ప్రక్షాళన చేస్తున్నామన్నారు. శ్రీకాళహస్తిలో రౌడీయిజం మాట వినబడేందుకు వీలులేదన్నారు. వైసీపీ రౌడీమూకలు ఇకనైనా తీరు మార్చుకోకపోతే జైలు తప్పదని హెచ్చరించారు. నియోజకవర్గంలోని ప్రతి మండలంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాలను ప్రారంభిస్తామన్నారు. పారదర్శకతతో ప్రజలకు జవాబుదారి పాలన అందిస్తామని సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మునిరాజ నాయుడు, రవీంద్రనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, ప్రమాణస్వీకారం అనంతరం తొలిసారి శ్రీకాళహస్తికి విచ్చేసిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి మంగళవారం టీడీపీ శ్రేణులు అఖండ స్వాగతం పలికాయి. గజమాలలతో సత్కరించి ఊరందూరు వరకు ర్యాలీగా సాగారు.

మండలాభివృద్ధికి సహకరించండి: ఆదిమూలం



సమావేశంలో మాట్లాడుతన్న ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు, జూలై 9: అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే ఆదిమూలం కోరారు. మంగళవారం సత్యవేడు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ప్రతిమ అధ్యక్షతన మండల మీట్ జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం తదితర మౌలిక వసతుల కల్పనపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు. ఇటీవల తాను చిన్నపాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించినప్పుడు ఆస్పత్రిలో సిబ్బంది ఒకరు కూడా లేరని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే సహించేది లేదన్నారు. మండలంలోని ప్రభుత్వాస్పత్రులకు వచ్చే పేదలకు మెరుగైన వైద్యం అందించే విధంగా కృషి చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. సత్యవేడు నుంచి విజయవాడకు మరో బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ డీఎం వెంకటేశ్వర్లుకు సూచించారు. కాగా, సమావేశానికి ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్, ఆర్‌అండ్‌బీ డీఈలు, వెటర్నరీ ఏడీఏ హాజరుకాకపోవడంపై ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమం అనంతరం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీపై జనుములు, జీలగలను పంపిణీ చేశారు. సమావేశంలో జడ్పీటీసీ విజయలక్ష్మి, ఎంపీడీవో చంద్రశేఖర్, తహసీల్దార్ రామాంజనేయులు, సీఐ దివాకర్ రెడ్డి, వ్యవసాయశాఖ ఏడీఏ సుబ్రహ్మణ్యం, ట్రాన్స్‌కో ఏడీఏ చంద్రనాయక్, అగ్రికల్చర్ ఏవో మురళి, ఎంఈవో రవి, ఆర్‌అండ్‌బీ ఏఈ ఇశ్రాయేల్, వైద్యాధికారులు అనిత, సురేష్, సుబ్రహ్మణ్యం, ఉపాధి ఏపీవో కృష్ణయ్య, వెలుగు ఏపీవో స్వర్ణలత, ఈవోపీఆర్‌డీ రవికుమార్ సర్పంచులు, ఎంపీటీసీలు, సెక్రటరీలు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక విధానంతో పేదలకు లబ్ధి

సత్యవేడు, జూలై 9: ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక విధానంతో సామాన్యులకు భారీ ఊరట లభించిందని ఎమ్మెల్యే ఆదిమూలం పేర్కొన్నారు. మంగళవారం సత్యవేడులో మీడియాతో ఎమ్మెల్యే మాట్లాడుతూ నాణ్యమైన ఇసుకను ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నదే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఇసుకను పేదలకు అందకుండా చేసి మాఫియాను నడిపిందని విమర్శించారు. కాగా, సత్యవేడు ప్రభుత్వాస్పత్రి, మహాత్మ జ్యోతీబా పూలే బాలుర గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే తనిఖీ చేశారు. ఆస్పత్రిలో వార్డులను పరిశీలించి, మెడికల్ సూపరిండెంట్ సురేష్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు.అనంతరం గురకుల పాఠశాలకు చేరుకుని విద్యార్థుల సమస్యల పట్ల అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కూర్చొని భోజనం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాసులు, సీఐ దివాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ మస్తాన్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పరమశివం, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నతి

శ్రీకాళహస్తి, జూలై 9: విద్యతోను ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి అన్నారు. తొట్టంబేడు మండలంలోని చియ్యవరం పాఠశాల విద్యార్థులకు రిషితారెడ్డి చేతుల మీదుగా ఆగ్రామ యువకులు పుస్తకాలను పంపిణీ చేశారు.

తాగునీటి పైపులైనుకు మరమ్మతులు

తారకరామనగర్, జూలై 9: తాగునీటి పైపులైన్ వద్ద నీరు వృథాగా పోతూ కలుషితం అవుతోందని మంగళవారం ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితం కావడంతో అధికారులు, పాలకులు స్పందించారు. క్లస్టర్ ఇన్‌చార్జి బుజ్జి నాయుడు, పంచాయతీ అధికారులు పైపులైనుకు మరమ్మతులు చేయించారు. మురుగునీటిని కూడా తొలగించడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

గుంతల పూడ్చివేత

రేణిగుంట, జూలై 9: పట్టణంలోని బజారువీధి గుంతల మయం అయిందని, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితం కావడంతో పంచాయతీ అధికారులు స్పందించారు. మంగళవారం బజారువీధిలో ఎన్టీఆర్ విగ్రహం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ఏర్పడిన గుంతలను పూడ్చివేశారు.

గెరిగె ఊరేగింపు

పిచ్చాటూరు, జూలై 9: మండలంలోని కొత్త గొల్లకండ్రిగలో జరుగుతున్న గంగజాతరలో భాగంగా మంగళవారం ఉదయం, సాయంత్రం గెరిగె ఊరేగింపు జరిగింది. జాతర సందర్భంగా గ్రామంలో భారీ అమ్మవారి కటౌట్లు ఏర్పాటు, విద్యుత్ దీపాలంకరణ చేశారు.

తాగునీటి సమస్య పరిష్కారం

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 9: మండలంలోని ఆలత్తూరు దళితవాడలో తాగునీటి సమస్యను టీడీపీ నాయకులు మంగళవారం పరిష్కరించారు. దళితవాడలో బోరు అడుగంటిపోవడంతో నెల రోజులుగా స్థానికులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. సర్పంచు, అధికారులకు చెప్పినా పట్టించుకోకపోవడంతో గ్రామంలోని టీడీపీ నాయకులు చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించారు.

ఆటో స్టాండ్ ఏర్పాటు

వరదయ్యపాళెం, జూలై 9: వరదయ్యపాళెం మండలం కడూరు క్రాస్ వద్ద ఏఐటీయూసీకి అనుబంధంగా అంబేడ్కర్ ఆటోస్టాండ్‌ను మంగళవారం ఏర్పాటు చేశారు.

వాహన చోదకులూ 'జరభద్రం'

- మళ్లీ కుంగుతున్న రేణిగుంట రోడ్డు



రేణిగుంట ఉప్పరపాళెం క్రాస్ వద్ద కుంగిపోయిన రహదారి

తిరుపతి అర్బన్, జూలై 9: రేణిగుంట ప్రధాన మార్గంలోని ఉప్పరపాళెం క్రాస్ నుంచి దాదాపు 200మీటర్ల వరకు రోడ్డు కుంగిపోయి పెద్ద పెద్ద రంధ్రాలు ఏర్పడ్డాయి. గతంలో వేసిన అండర్‌డ్రైనేజీ పైపుల పైభాగాన ఇతర కేబుళ్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తవ్విన గాడిని మొక్కుబడిగా పూడ్చారు. దాంతో గతేడాది కూడా రోడ్డు కుంగిపోవడం, వర్షపునీరు ప్రవహించడంతో మట్టి కొట్టుకుపోయి పెద్ద పెద్ద రంధ్రాలు ఏర్పడ్డాయి. అప్పట్లో సంబంధిత విభాగం అధికారులు స్పందించి రంధ్రాలను పూడ్చి రహదారికి మరమ్మతులు చేశారు. ఇటీవల వర్షాలు కురుస్తుండటంతో నారాయణాద్రి హాస్పిటల్ నుంచి ఉప్పరపాళెం క్రాస్ వరకు అక్కడక్కడ పెద్ద పెద్ద రంధ్రాలు ఏర్పడ్డాయి. రాత్రి వేళ పొరపాటున రోడ్డు అంచుల్లో ద్విచక్ర వాహనాలు నడిపితే పడిపోవాల్సిందేనని వాహన చోదకులు భయాందోళన చెందుతున్నారు. అడ్డుగా ట్రాఫిక్ బోర్డులు, టైర్లు, రాళ్లు పెట్టినా పెద్దగా ఉపయోగం లేదని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

పిచ్చాటూరు, జూలై 9: పిచ్చాటూరు పట్టణంలోని మూడు ఎరువులు, పురుగు మందుల దుకాణాలను మంగళవారం విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. రికార్డులు, స్టాక్ పరిశీలించారు. రైతులు కొనుగోలు చేసిన ఎరువులు, పురుగు మందులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారులు ఎల్లప్ప, ధనంజయరెడ్డి, జీవానందం, వ్యవసాయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదరికాన్ని తరిమికొట్టే వజ్రాయుధం విద్య

ఏర్పేడు, జూలై 9: పేదరికాన్ని తరిమికొట్టడానికి విద్య ఒక వజ్రాయుధమని ఆకాంక్ష స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవిబాబు అన్నారు. ఏర్పేడు మండలం కొత్తవీరాపురం పంచాయతీ వడ్డిమిట్ట ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఆకాంక్ష స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులు రాత పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను పంపిణీ చేశారు. చెన్నైలోని ఎస్ఆర్ఎం కళాశాలలో చదివే విద్యార్థులు పొదుపు చేసుకున్న డబ్బుతో ఆకాంక్ష సంస్థ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సూర్యనారాయణ, ఎస్ఆర్ఎం కళాశాల విద్యార్థులు, సంస్థ వలంటీర్లు మస్తాన్, పృథ్వీ పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

పరిశ్రమల ఏర్పాటుకు తరలిరండి

- ఎంఎస్ఎంఈలకు కోసలనగరం అనుకూలం
- ఏపీలో ఇన్వెస్టర్ ఫ్రెండ్లీ ప్రభుత్వం
- త్వరలోనే ప్రత్యేక పారిశ్రామిక పాలసీ
- చెన్నైలో పారిశ్రామికవేత్తలతో ఎమ్మెల్యే భాను భేటి



అంబత్తూరు ఇండస్ట్రియల్ మానుఫ్యాక్చరింగ్ అసోసియేషన్ నేతలతో ఎమ్మెల్యే భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, జూలై 9: సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు నగరి నియోజకవర్గ పరిధిలోని విజయపురం మండలం కోసలనగరం అనుకూల ప్రదేశమని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తెలిపారు. మంగళవారం చెన్నైలో అంబత్తూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్ మానుఫ్యాక్చరింగ్ అసోసియేషన్‌తో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు సారధ్యంలోని ఇన్వెస్టర్ ఫ్రెండ్లీ ప్రభుత్వం తయారీ రంగ పరిశ్రమలను ప్రత్యేకించి సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు నూతన పాలసీని తీసుకురానున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో విరివిగా ఉద్యోగాలను కల్పించాలనే లక్ష్యంతో పనిచేస్తున్న ప్రభుత్వమని వెల్లడించారు. చంద్రబాబునాయుడు స్ఫూర్తితో నగరి నియోజకవర్గంలో కూడా పరిశ్రమల స్థానిక ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ప్రకటించారు. ఇందులో భాగంగా తన తండ్రి మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమనాయుడు హయాంలో విజయపురం మండలంలోని కోసలనగరం వద్ద ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు ఏపీఐఐసీ ద్వారా 1579 ఎకరాలను సేకరించిన విషయాన్ని గుర్తుచేశారు. అంబత్తూరులో పరిశ్రమల విస్తరణకు స్థలాభావ సమస్య ఉన్న నేపథ్యంలో చెన్నైకు సమీపంలో ఉన్న కోసలనగరంలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూమి సిద్ధంగా ఉందన్నారు. అలాగే పరిశ్రమలకు అసరమైన మౌలిక సౌకర్యాల కల్పన తమ ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందన్నారు. కష్టించి పనిచేసే యువత నగరి నియోజకవర్గంలో ఉన్నారని పరిశ్ర మలు ఏర్పాటు చేస్తే మానవ వనరుల ఇబ్బంది కూడా ఉండదని వివరించారు. నియోజకవర్గ యువత ఉపాధి, ఉద్యోగాల కోసం చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ తదితర పట్టణాలకు వసల వెళ్లాల్సిన పరిస్థితి ప్రస్తుతం నెలకొని ఉందని, అలాంటిది ఇక్కడే అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు వివరించారు. పారిశ్రామిక వేత్తలు కోసల నగరం ఇండస్ట్రియల్ పార్కును తమ భవిష్యత్తు వ్యాపార విస్తరణకు ప్రాధాన్యమివ్వాలని ఆయన కోరారు. అనంతరం కోసలనగరం ఇండస్ట్రియల్ పార్కుపై పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా పారిశ్రామికవేత్తలు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాధవనాయుడు, లక్ష్మీపతిరాజు, గంజి మాధవయ్య, అంబత్తూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఏఎస్ హరిప్రసాద్, అరవింద్, అరువెల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కుంభాభిషేకం ఉత్సవానికి రండి

ఎమ్మెల్యే భానుప్రకాష్‌కు ఆహ్వానం

పుత్తూరు అర్బన్, జూలై 9: గేటు పుత్తూరులోని తాటితోపు వీధిలో ఉన్న వినాయకుడి ఆలయం కుంభాభిషేకం మహోత్సవానికి హాజరు కావాలని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ను నిర్వాహకులు ఆహ్వానించారు. మంగళవారం ఎమ్మెల్యేను తిరుపతిలోని ఆయన నివాసంలో కలిసి ఈనెల 12వ తేదీన నిర్వహించే కుంభాభిషేక ఆహ్వాన పత్రిక అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కరుణాకరన్, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్, నాయకులు బాలాజీ, కైలాసం, శేఖర్, సురేష్ పాల్గొన్నారు.